
వార్త
ఆదివారం
28 జులై, 2024
ఆలయాల్లో
'అనంత'
సంపద!



# నాని జోడీగా జాన్వీకపూర్!

నేచురల్ స్టార్ నాని నటించిన 'సరిపోదాం శనివారం' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రాన్ని దర్శకుడు వివేక్ ఆత్రేయ పూర్తి రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా తీర్చిదిద్దడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఇందులో అందాల భామ ప్రియాంక మోహన్ నటిస్తోంది.

ఈ చిత్రం తరువాత నాని దర్శకుడు శైలేష్ కొలనుతో 'హిట్ 3', 'దసరా' లాంటి బ్లాక్ బస్టర్ హిట్ అందించిన శ్రీకాంత్ ఓదెలతో ఒక సినిమా ఉంది. నాని కోసం మరోసారి పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ కథను సిద్ధం చేసిన శ్రీకాంత్ ఓదెల, ఇందులో హీరోయిన్‌గా జాన్వీకపూర్‌ను ఓకే చేసినట్లు సమాచారం. టాలీవుడ్‌లో ఇప్పటికే 'దేవర', 'ఆర్‌సి16' సినిమాలతో బిజీగా వున్న అమ్మడు నానితో నటించనుందనే వార్త అభిమానుల్లో ఆసక్తి కలిగిస్తోంది. ఈ విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది. చెరుకూరి సుధాకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు.

తారాతీరం

# నాగ చైతన్య ద్విపాత్రాభినయం?



అక్కినేని నాగ చైతన్య కథానాయకుడుగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ వస్తున్న సంగతి తెలిసిందే. 'విరూపాక్ష' సినిమాతో కార్తీక్ దండు మంచి పేరు తెచ్చుకున్నాడు. అందువల్ల ఈ సినిమాపై అందరికీ మంచి అంచనాలు ఉన్నాయి.

అయితే తాజా సమాచారమేమిటంటే ఇందులో నాగ చైతన్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. చైతూ రెండు పాత్రల్లో ఒక పాత్ర చాలా భిన్నంగా ఉంటుందనీ, ఈ పాత్రలో అతని లుక్ కూడా చాలా కొత్త ఉంటుందని సమాచారం.

పూజాహెగ్డే ఈ చిత్రంలో నాగచైతన్యతో కలిసి నటించనుంది. వీరిద్దరి మధ్య లవ్ స్టోరీ కూడా చాలా ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది. అక్టోబరు నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర నిర్మించబోతోంది. ప్రస్తుతం అక్కినేని నాగ చైతన్య-సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో రాబోతున్న భారీ చిత్రం 'తండేల్'.

ఆదివారం వార్త
28 జులై, 2024

## మంచి ముత్యాలు

ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తిస్తేచాలు. దేశం ఆర్థికంగా ప్రగతిపథాన ఉంటుంది.

- అరిస్టాటిల్

## విషయ విశేషం

ఉచితంగా కూరగాయలు.. 4
'సంఘీ'భావం....5
పెరుగుతున్న నేరప్రవృత్తి
కవర్ స్టోరీ..6
ఆలయాల్లో 'అనంత' సంపద!
చిరకాల స్నేహం...10
ఈవారం కవిత్వం..12
గులాబీ నవ్వు
అగ్నిభూమి అజర్‌బైజాన్...14
ఔషధ మొక్కలు .....18
కథ.. 20
అంతర్యామి
సాహిత్యం..23
జాషువా సాహిత్య వైశిష్ట్యం
తీరిన కల...26
ఈ దోషం తీసివేస్తే.... 29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### వృద్ధాప్యానికి దూరంగా..

శరీర పటుత్వాన్ని కోల్పోవడం, జ్ఞాపకశక్తి సన్నగిల్లడం, చర్మం ముడతలు పడటం..సాధారణంగా ఇవే మనకు తెలిసిన వృద్ధాప్య లక్షణాలు. కానీ పరిశోధకులు వీటన్నింటికీ మూలం మన క్రోమోజోముల్లో ఏర్పడే ఓ చిన్నమార్పని చెబుతారు. మన శరీరంలో 23 జతల క్రోమోజోములుంటాయని చిన్నప్పుడు చదువుకుని ఉంటాం కదా! అవి ఒకదానికొకటి ఒరిపిడికి గురికాకుండా టెలోమేర్స్ అనే పొడవైన జన్యుతీగలు కాపాడుతుంటాయి. వీటి పొడవు తగ్గడం మొదలైనప్పుడే...మనకు వృద్ధాప్యం వచ్చినట్టు శాస్త్రవేత్తలు భావిస్తారు. కానీ ఇక్కడో విషయం ఉంది. మనకు వృద్ధాప్యం రాకముందు కూడా మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనైనప్పుడో అనారోగ్యాలప్పుడో టెలోమేర్స్ పొడవు తగ్గుతుంటుంది. అలా తగ్గినప్పుడల్లా..మన శరీరంలోని ఓ ప్రొటీన్ స్పందించి టెలోమేర్స్‌ని మళ్లీ మామూలు స్థితికి చేరుస్తుంది. అందుకే 'టెలోమెరేస్ రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్' (టెర్ట్) అంటారు ఆ ప్రొటీన్‌ని. మనకు ఏళ్లుపైబడేకొద్దీ ఈ టెర్ట్ ప్రొటీన్ పనిచేయడం మానేస్తుంది. తాజాగా అలా పనిచేయడం మానేసిన 'టెర్ట్ ప్రొటీన్'కి పునర్జీవితాన్నిచ్చే ఓ రసాయన మూలకాన్ని ఆవిష్కరించారు అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. టెర్ట్ యాక్టివేటింగ్ కాంపౌండ్ (ట్యాక్) అని పేరుపెట్టిన ఈ మూలకాన్ని ఎలుకలపైన ప్రయోగిస్తే వాటిలో శారీరకంగానూ, మేధోపరంగానూ వృద్ధాప్యఛాయలు పూర్తిగా తగ్గి మళ్లీ యవ్వనం మొగ్గతొడిగిందట. అందుకే త్వరలో మానవులపైన ప్రయోగించబోతున్నారు.

### కాకుల్ని చంపేస్తారట

కాకులు హాని చేసే పక్షులేమీ కాదు. వాటిని చంపాలని కూడా ఎవరూ అనుకోరు. కానీ కెన్యా ప్రభుత్వం వాటిపైన యుద్ధం ప్రకటించింది. అదీ మనదేశం నుంచి వలస వెళ్లిన దాదాపు పదిలక్షల కాకుల్ని ఆరునెలల్లో చంపేయడానికి సిద్ధమైంది. అందుకోసం ప్రత్యేకంగా విషాన్నీ తయారు చేయించింది. అసలు కెన్యా వాసులు కాకుల మీద అంత పగబట్టడానికి కారణమేంటో తెలుసా.. అవి ఆరుబయట ఆహారపదార్థాలను లాక్కెళ్లడం, పంటలకు నష్టం కలిగించడం, సముద్రతీర ప్రాంతాల్లో ఇతర పక్షిగూళ్లని ధ్వంసం చేయడంతో ఆయాజాతులు అంతరించిపోవడం తదితర కారణాలతో చాలామంది వాటిపైన ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారట.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ఉచితంగా కూరగాయలు

**కూరగాయలు ఎంత తాజాగా ఉంటే వంట అంత రుచిగా వస్తుంది కదా. కానీ, ఏరోజు కాయగూరలు ఆరోజు తెచ్చుకునే అవకాశం అందరికీ ఉండదు. అందుకే వారానికో పదిరోజులకో సరిపడా కూరగాయలు తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుంటారు చాలామంది. ఇక, మార్కెట్‌లో ఏ కాయగూరను చూసినా రేట్లు మండిపోతున్నాయి.**

అలాగని ఇంట్లో పండించుకోవడం అందరికీ సాధ్యమయ్యే పనీకాదు. మరి డబ్బులు వదిలించుకోకుండా, రసాయనాల కారణంగా జబ్బులు తెచ్చుకోకుండా మంచి కూరగాయలతో రోజూ రుచికరమైన భోజనం చేయడం ఎలాగో కేరళలోని మెప్పడం



గ్రామస్థులు చూపిస్తున్నారు.

**ఇరవై ఎకరాల్లో:** మెప్పడం వ్యవసాయమే జీవనాధరమైన గ్రామం. అక్కడున్న మూడొందల కుటుంబాల్లోని రైతులంతా ఉన్నత విద్యావంతులే. కొవిడ్‌కు ముందు కమర్షియల్ పంటల్ని పండించేవారు. కానీ ఎవరూ కూరగాయలతోటలు వేసేవారు కాదు. లాక్‌డౌన్ సమయంలో మాత్రం ఆ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంట్లోనే కూరగాయలు పండించుకున్నారు. కొవిడ్ తగ్గిపోయి అంతా మామూలయ్యాక చాలామంది ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఇళ్లలో కూరగాయల సాగును మానేసి, మార్కెట్లో కొనడం మొదలుపెట్టారు. అది గమనించిన అరుణ్ అనే రైతు..గ్రామస్థులంతా ఆరోగ్యం గురించి ఆలోచించి ఒకే కుటుంబంగా, ఒకేమాట మీద ఉంటే బాగుంటుంది అనుకున్నాడు. అదే విషయాన్ని గ్రామపెద్దలతో చెప్పి..'అందరం కలిసి కూరగాయలు పండించుకుని ఎవరికి కావల్సినవి వాళ్లం తీసుకుందాం' అన్నాడు. ఆ ఆలోచన ప్రతిఒక్కరికీ నచ్చింది. రసాయనాల వల్ల కేన్సర్ ప్రమాదం పొంది ఉన్న నేపథ్యంలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు పండించాలని మెప్పడం వాసులు నిర్ణయించుకున్నారు. ఎవరి పొలాల్లో వాళ్లు వ్యవసాయం చేసుకుంటూనే కూరగాయల సాగుకు సిద్ధమై– ఓ వందమంది బృందంగా ఏర్పడి ఎవరు ఏ పని చేయాలో ప్రణాళిక వేసుకున్నారు. తరువాత ఊరి చివర ఉన్న ఇరవై ఎకరాల స్థలాన్ని అందుకోసం కేటాయించుకున్నారు. తలా కొంత డబ్బు వేసుకుని దాదాపు రెండు లక్షల రూపాయలు పోగు చేశారు. ఆ డబ్బుతో కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టారు. ఐదెకరాల్లో వరి, మరో ఐదెకరాల్లో ఆకుకూరలూ, మిగిలిన పది ఎకరాల్లో దోసకాయ, గుమ్మడి, పొట్లకాయ, బెండకాయ, పాలకూర ఇలా చెప్పుకుంటూపోతే అన్ని రకాల్ని పండిస్తూ గతేడాది దాదాపు 30 టన్నుల కాయగూరల్ని ఉత్పత్తి చేశారు.

**పదిగ్రామాల్లో పంచుతూ**

ఈ కూరగాయల తోట కోసం మెప్పడం ప్రజలు సొంతంగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటారు. అంతేకాదు, ప్రతి ఒక్కరికీ పోషకాహారం అందాలనే ఉద్దేశంతో కూరగాయలతోపాటు ఆకుకూరలు కూడా వండుకోవాలనే నిబంధన ఉంది. ప్రతిరోజూ ఉదయాన్నే కమిటీ సభ్యులు వచ్చి ఆకుకూరలు కోస్తారు. కూరగాయలేమో ఎవరికి ఇష్టమైనవి వాళ్లు తీసుకెళుతుంటారు. మిగతావాటిని చుట్టుపక్కల పదిగ్రామాల్లోని వారికి ఉచితంగా పంచుతారు. అందుకోసం వాహనాలను గ్రామాల్లోకి పంపుతారు. దగ్గరి గ్రామాల వారేమో తోటలవద్దకే వచ్చి తీసుకెళుతుంటారు. మొదట్లో తోట కోసం ప్రతి ఒక్కరూ సొంత డబ్బును కేటాయించారు. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ఐదెకరాల్లో పండిన వరి పంటను అమ్మి, ఆ డబ్బునే కూరగాయల సాగుకు పెట్టుబడిగా పెడుతున్నారు. కూలీలకూ, ఎరువులకూ కూడా ఖర్చు లేకుండా కమిటీ సభ్యులే అన్ని పనులూ చేస్తారు. పిల్లలరూ, పెద్దలూ కూడా స్వచ్ఛందంగా సాయపడుతుంటారు. కలిసికట్టుగా కాయగూరలు పండించుకుని అనారోగ్యాలకు దూరంగా ఉంటూ గ్రామంలోనూ ఆరోగ్యకర వాతావరణాన్ని పెంపొందిస్తున్న మెప్పడం వాసులు అందరికీ ఆదర్శం.



'సంఘీ' భావం



# పెరుగుతున్న నేరప్రవృత్తి

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరప్రవృత్తి స్థాయి కూడా ఆందోళనకర పరిస్థితులకు చేరింది. మానవసంబంధాలు సన్నగిల్లాయి. కనికరం, జాలి వంటివి లేకుండా దారుణంగా హత్యలు, మానభంగాలకు పాల్పడుతున్నారు. నెలల పసికందు నుంచి 10 ఏళ్లలోపు బాలికలు అత్యాచారాలకు గురౌతున్నారు. ఆశ్చర్యమేమిటంటే బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారు కూడా పలు కేసుల్లో మైనర్లే కావడం విశేషం. సెల్‌ఫోన్లు అందుబాటులోకి రావడం, అందులో నీలిచిత్రాలు చూసే అవకాశం ఉండటంతో మైనర్లు, యువత విచక్షణను కోల్పోతున్నారు. సమాజానికి చక్కటి సందేశం ఇవ్వవలసిన సినిమాలు, టీవీ సీరియల్స్ కూడా నేరప్రవృత్తిని పెంచే విధంగా నిర్మిస్తున్నారు. కొన్ని చిత్రాల్లో కత్తితో పదిమందిని ఒకేసారి నరుకుతూ వెళ్లిన ఘటనలు చూపిస్తున్నారు. మహిళలపై అత్యాచారాలు, ఆకృత్యాలను ప్రముఖంగా చూపిస్తున్నారు. మరికొన్ని సినిమాల్లో శృంగార దృశ్యాలు మితిమీరుతున్నాయి. ద్వందార్థాలతో కూడిన సంభాషణ యువతను, మైనర్లను రెచ్చగొట్టేవిధంగా ఉంటోంది. ముఖ్యంగా పాన్ ఇండియా పేరుతో వస్తున్న కొన్ని సినిమాల్లో హింసకు సంబంధించిన దృశ్యాలు అధికంగా ఉంటున్నాయి. కత్తితో నరకడం, సుత్తితో తలపై మోది హత్య చేయడం వంటి దృశ్యాలను పరిధికి మించి జుగుప్సాకరంగా చూపిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఆరవ తరగతి చదువుతున్న మైనర్లు సామూహిక అత్యాచారం జరిపారు. అంతటితో ఆగకుండా బాలికను హత మార్చి పంటకాలువలో పడేశారు. బాపట్ల జిల్లా వినుకొండలో ఒక వ్యక్తిని కత్తితో నడిరోడ్డుపై దారుణంగా నరికి చంపాడు. ప్రజలంతా చూస్తుండగానే సుమారు పది నిమిషాల పాటు ఈ మారణకాండ కొనసాగింది. ముందుగా చేతులు నరికి ఆ తరువాత తలపై కొట్టి హతమార్చాడు. వరంగల్ జిల్లాలో తమ ప్రేమను కాదన్నారని ఆగ్రహించిన యువకుడు ప్రియురాలి తల్లిదండ్రులపై దాడి చేశారు. ఇలాంటి ఘటనే అనకాపల్లిలో కూడా జరిగింది. కొన్ని ఘటనలకు రాజకీయాలు కూడా తోడు కావడంతో నేరాల సంఖ్య మరింతగా పెరిగిపోతోంది. తెలుగురాష్ట్రాల్లో గత కొంతకాలంగా నేరాలు అధికంగా నమోదు అవుతున్నాయి. వీటిలో ముఖ్యంగా అత్యాచారాలు, హత్యలు ఆందోళనకరస్థాయిలో ఉంటున్నాయి. లైంగిక దాడులు, అత్యాచారాలు వంటి నేరాలకు పాల్పడుతున్న బాలల్లో దాదాపు 95 శాతం మంది అశ్లీల దృశ్యాలను సెల్‌ఫోన్‌లలో చూడటం వల్లే జరుగుతున్నాయని దర్యాప్తులో వెల్లడి అవుతోంది. ముఖ్యంగా కరోనా పరిస్థితుల తరువాత సెల్‌ఫోన్లు ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూలు స్థాయి విద్యార్థుల వరకు అందుబాటులో వచ్చాయి. ఆన్‌లైన్ తరగతుల వల్ల ప్రతి విద్యార్థి చేతిలోకి ఫోన్‌లు వచ్చాయి. బోధన వ్యవస్థలో మార్పులు రావడంతో తల్లిదండ్రులు కూడా వారిని కట్టడి చేయలేని పరిస్థితి ఏర్పడింది. సెల్‌ఫోన్, ట్యాబ్‌లలో పాఠ్యాంశాలు పరిశీలిస్తున్నారో, నీలి చిత్రాలు వీక్షిస్తున్నారో అర్థం కావడం లేదు. నీలి చిత్రాల్లో మితిమీరిన శృంగార దృశ్యాలు చూసిన పసిమనస్సుల్లో వికృత ఆలోచనలు వస్తున్నాయి. తెలిసీతెలియక కొందరు, స్నేహితుల ప్రభావంతో మరికొందరు నేరాలకు పాల్పడుతున్నారు. నీలి చిత్రాల ప్రభావంతో పాటు గంజాయి, మాదకద్రవ్యాలు కూడా నేరాలకు దోహదపడుతున్నాయి. ప్రస్తుతం గంజాయి పెద్ద సంఖ్యలో రవాణా అవుతోంది. పాఠశాలల్లో సైతం గంజాయి అందుబాటులో ఉంది. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్నారు. విద్యాసంస్థల సమీపంలో ఉండే కొన్ని కిరాణా, పుస్తకాల దుకాణాల్లో ఇవి అందుబాటులో ఉంటున్నాయి. ముందు సరదాగా గంజాయి తీసుకున్నా క్రమంగా దానికి అలవాటు పడుతున్నారు. గంజాయి, మాదకద్రవ్యాల మత్తుకు అలవాటు పడిన యువత, మైనర్లు విచక్షణ కోల్పోతున్నారు. అత్యాచారాలకు, హింసకు ఒడిగడుతున్నారు. నేరాల విషయంలో పోలీసు వ్యవస్థ కూడా ఆశించిన విధంగా దర్యాప్తు చేపట్టలేకపోతోంది. నేరం చేసిన వారిని సకాలంలో పట్టుకుని న్యాయస్థానంలో ప్రవేశపెట్టడంలో విఫలం అవుతున్నారు. అత్యాచారాలకు పాల్పడిన వారిపై సరైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం, పకడ్బందీ ఆధారాలతో ఛార్జిషీటు దాఖలు చేయడం వంటి వాటిలో చాలా వరకు విఫలం అవుతున్నారు. గంజాయిని విక్రయించే వారిని పట్టుకుని మమ అనిపిస్తున్నారు. గంజాయి రవాణా, ఉత్పత్తి, వినియోగం అనే అంశాలపై ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తే పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. గంజాయి దొరికినప్పుడు హడావిడి చేయడం తరువాత మరిచిపోతున్నారు. ఇదే పరిస్థితి మాదక ద్రవ్యాల విషయంలో కూడా ఎదురౌతోంది. కేవలం పెడ్లర్లు మినహా కీలకవ్యక్తులు, ఉత్పత్తిదారులు పట్టుబడిన దాఖలాలు లేవు. ఏదైనా అధికారి దూకుడుగా వ్యవహరిస్తే సదరు అధికా రిని ఆ స్థానం నుంచి బదిలీ చేస్తున్నారు. దీనితో ఆయా కేసులు దర్యాప్తుకు నోచుకోవడం లేదు. ఇలాంటి ఘటనలు లెక్కకు మించి గత దశాబ్దకాలంగా జరుగుతున్నాయి. మాదక ద్రవ్యాలను, గంజాయిని సమూలంగా నిర్మూలించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వాల్లో కనిపించడం లేదు. ఇక మైనర్ల విషయానికి వస్తే వారి తల్లిదండ్రులు తగిన బాధ్యత వహించాల్సి ఉంటుంది. పిల్లల చదువులు, ప్రవర్తన ఎప్పటిక ప్పుడు గమనించాలి. సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లలో వారు ఏయే అంశాలు పరిశీలిస్తున్నారన్న అంశంపై దృష్టి సారించాలి. విద్యార్థులు నేరప్రవృత్తి వైపు మొగ్గుచూపితే ఉపాధ్యాయులు గమనించి వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలి. అప్పుడే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# ఆలయాల్లో 'అనంత' సంపద!

కవర్ స్టోరీ
ఎ.వి.వి.ప్రసాద్
అసోసియేట్ ఎడిటర్, వార్త

**100 కోట్లు..
వెయ్యికోట్లు..
లక్షకోట్లు..**

ఇలా అపరిమితమైన ఆదాయం వచ్చే అనంత సంపద కలిగిన ఆలయాలు మనదేశంలో ఒకటి, రెండు కాదు..ప్రతిరాష్ట్రంలో రెండుమూడైనా ఉన్నాయి. లెక్కించిన సంపదే అంత ఉంటే, ఇక లెక్కల్లోకి రానిది నిజంగా అనంతమే. ఆలయాల సంపద అగణితంగా పెరగడానికి భక్తులలోని మతవిశ్వాసం కావచ్చు, ప్రభువులు లేదా అధికార పెద్దలలోని అభద్రతాభావం కావచ్చు. మాన్యాల మీద వచ్చే ధాన్యాలు కావచ్చు. కారణమేదైనా ఆలయసంపద మాత్రం అపారం. అందుకే ప్రభుత్వాల కన్ను తొలుత దానిపైనే పడుతూంటుంది. ఆలయ నిర్వహణ బోర్డుల దృష్టి కూడా దానిపైనే ఉంటుంది. కొన్ని పెద్ద ఆలయాల ట్రస్టుబోర్డుల నాయకత్వం కోసం ఒక్కొక్కసారి చాలా అధికమైన పోటీయే ఏర్పడుతూంటుంది. ట్రస్టుబోర్డు సభ్యుడుగానైనా కావడానికి పెద్దపెద్ద రాజకీయ నాయకులు సైతం ప్రయత్నించడం చూస్తుంటాం. వ్యాపారవేత్తలు సరేసరి. సంవత్సరానికి 100 కోట్లుపైగా ఆదాయం వచ్చే ఆలయాలు మనదేశంలో కొన్ని దజన్లుపైగా ఉన్నాయి. ఈ ఆలయాలలోకి ప్రవేశించడానికి చాలామంది అందుకే మొగ్గు చూపుతుంటారు. ఆ ఆలయాల ట్రస్టుబోర్డు మెంబర్ కావడాన్ని చాలా ప్రత్యేకమైన హోదాగా భావిస్తుంటారు కూడా. దానిలో దైవభక్తి కొంత, ఇతర విషయాలపై అనురక్తి మరికొంత. అటువంటి సంపద ఆలయాలలో తిరువనంతపురంలోని అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని ప్రధానంగా చెప్పుకోవచ్చు. తరువాత తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, ముంబయిలోని సిద్ధివినాయక్ ఆలయం, షిర్డీ సాయిబాబా, అమృత్‌సర్ స్వర్ణాలయం, మధురమీనాక్షి, గుజరాత్ సోమనాథ్ ఆలయం, శబరిమల అయ్యప్ప, పూరీ జగన్నాథస్వామి, ఢిల్లీ స్వామి నారాయణ్ ఆలయం, జమ్ము వైష్ణోదేవి ఆలయం, వారణాసి విశ్వనాథ ఆలయం చెప్పవచ్చు. ఈ ఆలయాలన్ని చాలావరకు పురాతనమైనవే. షిర్డీబాబా వంటి కొన్ని ఆలయాలు మినహాయిస్తే మిగిలినవాటికి కొన్ని వందల సంవత్సరాల ఘనమైన చరిత్రే ఉంది. ఈ ఆలయాలలో నిక్షిప్తమై ఉన్న సంపద ఎంత? అనే ప్రశ్నకు కచ్చితమైన లెక్కలు ఎవరూ చెప్పలేకపోయినా, మొన్న అనంతపద్మనాభస్వామి ఆలయంలో లభించిన సంపద, ఇప్పుడు పూరీ జగన్నాథస్వామి ఆలయంలో కనుగొన్న సంపదను చూస్తుంటే కనీసం లెక్కించడం కూడా సాధ్యం కానంత ఉన్నదనే విషయం అర్థమవుతుంది. క్రీస్తుపూర్వం రెండు, మూడు శతాబ్దాల నుంచి క్రీ.శ 16,17వ శతాబ్దాం వరకు భారీ ఆలయాల నిర్మాణం జరుగుతూనే ఉంది. 18వ శతాబ్దం నుంచి ఆధునిక రీతిలో ఆలయనిర్మాణం కొనసాగుతోంది. కొన్ని ప్రాచీన ఆలయాలలో నేలమాళిగలు కూడా ఉంటాయి. తమిళనాట ఇటువంటి ఆలయాలు ఎక్కువగా కనిపిస్తాయి. గుజరాత్‌లో కూడా ఉన్నాయి. తెలియనివి ఇంకా ఉండవచ్చు. ఈ ఆలయాల నేలమాళిగలలో ఉన్న గుప్త సంపద నిజంగా అపారమే. గతంలో మహారాజులు, చక్రవర్తులు నిక్షిప్తం

చేసిన సంపద అది. ముఖ్యంగా మహమ్మదీయుల దండయాత్రల సమయంలో తమ సంపదనంతా ఆలయాల నేలమాళిగల్లో వారు దాచి ఉంచేవారు. తాము అత్యధికంగా విశ్వసించే వారికి మాత్రమే ఆ వివరాలు చెప్పేవారు. ఆలయాలను ధ్వంసం చేసి ఆ సంపదనంతా కొల్లగొట్టి పట్టుకువెళ్లిన మహమ్మదీయ రాజులు, మనదేశంలోనే తిష్ఠవేసి ఆ సంపదను అనుభవించిన విదేశీ ప్రభువుల చరిత్ర మనకు పేజీల కొద్దీ దొరుకుతుంది. ఆ దాడులను తిప్పికొట్టి, ఆలయాలను మన రాజులు, చక్రవర్తులు తిరిగి స్వాధీనం చేసుకొని ఆ సంపదను పరిరక్షించిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే దండయాత్రలు చేసి కొత్త రాజ్యాలను తమ ఏలుబడిలోకి తెచ్చుకొన్న తర్వాత మహారాజులు ఆలయాలకు భారీగా కానుకల సమర్పించిన ఉదంతాలు అనేకానేకం. శ్రీకృష్ణదేవరాయలు వంటి చక్రవర్తులు ఎన్నోసార్లు వజ్రవైఢూర్యాలను, మణిమాణిక్యాలను, అత్యంత విలువైన ఆభరణాలను, వందలు, వేలకొద్దీ ఎకరాల భూసంపదను ఆలయాలకు కానుకగా ఇచ్చినట్లు చరిత్రలో చూస్తున్నాం. తెలుగు, కన్నడ, తమిళప్రాంతాలలో సంపన్న ఆలయాలు అధిక సంఖ్యలో కనిపించడానికి అటువంటి రాజులు, చక్రవర్తులే కారణం. దానికి ముందు గుప్తుల కాలంలో కూడా ఎన్నో ఆలయాలు సకలసంపదలతో తులతూగినట్లు చరిత్రలో తెలుస్తుంది. అందుకే విదేశీయుల కన్ను ముందుగా మన ఆలయాలు, వాటి సంపదపై ఎక్కువగా పడుతూంటుంది. స్వాతంత్ర్యానంతరం ఈ ఆలయాలపై అధికారం కొన్నిచోట్ల ట్రస్టుబోర్డుల చేతుల్లోకి మరి కొన్నిచోట్ల ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లడంతో కథ మారింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఈ ఆలయాల అభివృద్ధికి కృషి కూడా ఎక్కువే జరిగింది. అప్పటి నుంచే ఆ ఆలయాల సంపదపై కూడా పాలకుల దృష్టి పడుతూవచ్చింది. దాని ఫలితంగానే 'లెక్కింపు' మొదలైంది.





## పూరీ ఆలయ సంపద ఎంత?

మనదేశంలోని ప్రాచీన విశిష్ట ఆలయాలలో పూరీ జగన్నాథస్వామి ఆలయం చాలా ముఖ్యమైనది. దాదాపు 1800 సంవత్సరాల క్రితం నాటి ఈ ఆలయం ప్రత్యేకతలు అన్నీఇన్నీ కావు. అలాగే సందప కూడా. అనంత పద్మనాభస్వామి ఆలయం నేలమాళిగల్లో ఎంత విలువైన సంపద ఉన్నదో తెలిసేవరకు తిరుమల ఆలయసంపదే ప్రథమస్థానం అనుకొనేవారు. కానీ 2012లో పద్మనాభస్వామి సంపద లెక్కింపు ప్రారంభమైన తర్వాత మనదేశంలో అంతకుమించిన సంపద కలిగిన ఆలయం లేదని తేలింది. ఆలయంలోని ఆరు నేలమాళిగాల్లో ఇప్పటికి ఐదు తెరవగలిగారు. వాటిలో బయటపడిన సంపదే దాదాపు ఐదులక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

అంతకాకపోయినా, పూరీ జగన్నాథస్వామి ఆలయంలో కూడా అపారనిధినిక్షేపాలు ఉన్నట్లే ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఒడిశాలోని పూరీలో ఉన్న ఈ ఆలయాన్ని 1136 సంవత్సరంలో చోడగంగరాజు నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. సంప్రదాయం, సైన్స్ సమ్మిళితమైన ఈ ఆలయం చరిత్ర మరింత లోతుగా పరిశీలిస్తే క్రీ.శ. 318లోనే ఉజ్జయిని రాజు ఇంద్రద్యుమ్నుడు నిర్మించినట్లుగా తెలుస్తుంది. అయితే ఇప్పుడున్న ఆలయాన్ని మాత్రం 1136 సంవత్సరంలో అనంతవర్మన్ చోడగంగ దేవ నిర్మించినట్లుగా చెబుతారు. 16వ శతాబ్దందాకా ఆలయంలో చాలా మార్పులు జరిగాయి. మొత్తం 18సార్లు దండయాత్రలకు, దోపిడీలకు గురైన ఈ ఆలయం సంపద ఇంత అని చెప్పలేం కానీ, లక్షల కోట్లే ఉంటుంది. పర్యాటకపరంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాన్ని యేటా కొన్ని లక్షలమంది సందర్శిస్తుండడంతో ఆదాయం కూడా అదేస్థాయిలో వస్తూంటుంది.

యేటా వచ్చే ఆదాయంగాక, గతంలో మహారాజులు, చక్రవర్తుల నుండి లభించిన సంపద ఒక ప్రత్యేకమైన 'రత్నభాండార్'లో కొన్ని శతాబ్దాలుగా అలాగే ఉంచారు. ఆ భాండార్‌ను అప్పుడప్పుడు తెరచి మరమ్మతులు చేసినా రాజవంశీకుల అధీనంలోనే ఉండడంతో 'ఇతరుల' కన్ను పడకుండా వస్తోంది.





స్వాతంత్ర్యానంతరం రెండుసార్లు మాత్రమే దానిని తెరచినట్లు తెలుస్తోంది. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచారనీ, అప్పట్లో దానిలోని సంపదను లెక్కించడానికే 70రోజులు పట్టిందనీ చెబుతారు. తాము అధికారంలోకి వస్తే ఆ భాండాగారాన్ని తెరిపించి సంపద వివరాలు ప్రజలకు తెలియచేస్తామని బిజెపి హామీ ఇవ్వడం, ఆపార్టీ ప్రభుత్వమే ప్రస్తుతం అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీ మేరకు భాండాగారాన్ని తెరిపించడం జరిగింది. ఈ నేపథ్యంలో, ఒడిశా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ విశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16మంది సభ్యుల ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైంది. జూలై 14న 'భండార్'ను తెరవాల్సిందిగా ఈ కమిటీ చేసిన సిఫారసుతో ప్రభుత్వం మొత్తానికి సంపదను బహిర్గతం చేసిందిగాని అప్పటి నుంచే అందరిలో కొత్త ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఈ సంపద ఎంత? అనేది ఇప్పుడే తెలియకపోవచ్చు. ఎందుకంటే లెక్కింపు జరపడానికి ముందు ఇంకా చాలా తతంగమే ఉంది. భండార్‌లోని బయట, లోపలి ఖజానా గదులలో లభించిన నిధినిక్షేపాలన్నిటిని బయటకు తెచ్చి ప్రత్యేకంగా నిర్మించిన 'రెండు స్ట్రాంగ్‌రూమ్'లలో భద్రపరిచారు. చాలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లున్న ఈ 'స్ట్రాంగ్‌రూమ్'లలో ఆ నిధి అంతా కొంతకాలం ఉంటుంది. భండార్‌లోని గదుల మరమ్మతులు పూర్తయిన తర్వాత మళ్లీ మొత్తం నిధిని అక్కడకు చేర్చి తరువాత లెక్కింపు ప్రారంభిస్తారు. ఆ తర్వాతే సంపద మొత్తం విలువ వెలుగులోకి రావచ్చు.



### 'రహస్యగది'లో ఏం దొరికింది?

భండార్‌లోని బయట బాహార్‌భండార్), లోపల (భితరాభండార్) గదులుగాక మరో 'రహస్య మందిరం' కూడా ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ మందిరం గురించి ఆకాలంనాటి కొందరికి తెలిసినా, ఇప్పటివారికి ఏమీ తెలియదు. కొన్ని శతాబ్దాలుగా ఒడిశా రాజవంశాలకు చెందిన రాజులతో పాటు నేపాల్ పాలకులు సైతం తమ సంపదనంతా ఆ ఆలయంలోనే దాచి ఉంచినట్లు తెలుస్తోంది. ఆ నిధి అంతా ఈ 'రహస్య మందిరం'లో ఉన్నట్లు కనుగొనడంతో ఆ మొత్తం విలువ తెలిస్తే అమితాశ్చర్యం కలుగవచ్చనే అంటున్నారు.



దాదాపు 46 సంవత్సరాల తర్వాత తెరుచుకున్న జగన్నాథుని ఖజానా 'రత్న భండార్'లో 1978 నాటి లెక్కల ప్రకారం కొన్ని వందల కిలోల బంగారు, వెండి ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు ఉన్నట్లు తేలింది. 15 చెక్కపెట్టెల్లో స్వర్ణాభరణాలు ఉన్నాయట.

### 1805లో అప్పటి పూరీ కలెక్టర్

ఛార్లెస్ గ్రోమ్ రూపొందించిన నివేదిక ప్రకారం బంగారు, వెండి నాణాల లెక్క మాత్రమే తెలిసింది. 1950 తర్వాత జగన్నాథ ఆలయ పరిపాలన చట్టం అమలులోకి వచ్చినపుడు రూపొందించిన 'రికార్డ్ ఆఫ్ రైట్స్' ప్రకారం బయటి గదిలో 150 బంగారు ఆభరణాలు, లోపలి గదిలో 180 రకాల వెండి, రత్నహారాలు ఉన్నట్లు తెలిసింది. 1978లో రూపొందించిన జాబితా ప్రకారం రెండు గదుల్లోను రాళ్లు పొదిగిన 454 బంగారు ఆభరణాలు, 221 కిలోలు పైగా వెండి వస్తువులు ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ లెక్కలన్నిటి మధ్య సరైన పొంతన లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వాస్తవ నిధికి, సంబంధిత అధికారులు చెబుతున్న లెక్కలకు మధ్య చాలా తేడా ఉన్నదని ఆలయానికి చెందిన అర్చక వంశీయులు అంటున్నారు. అలాగే రాజ వంశీకులు చెబుతున్న లెక్కలు కూడా భిన్నంగానే కనిపిస్తున్నాయి. తాజాగా లెక్కలు వేసి వివరాలు తెలిసిన తర్వాతనే వాస్తవమేమిటో తెలియగలదని కూడా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


పూరీ శ్రీక్షేత్రం రత్నభాండాగారం దిగువన రహస్య గది ఉందనీ, సొరంగ మార్గం ద్వారా వెళ్లగలిగే ఆ గదిలో చాలా విలువైన సంపద దాచారనీ కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. 1902లోనే ఈ సొరంగ మార్గం అన్వేషణకు ప్రయత్నించి విఫలమయ్యారనీ, దానిపై ఇప్పుడు దృష్టి పెట్టాలనీ అంటున్నారు. పూరీ రాజు కపిలేంద్ర దేవ్ తూర్పున, దక్షిణ ప్రాంతాలను జయించిన తర్వాత అక్కడి నుంచి తెచ్చిన సంపదనంతా జగన్నాథునికి సమర్పించినట్లు చరిత్రలో ఉంది. రహస్య గదిలో ఆ నిధి వున్నదనీ, దానిలో 34 బంగారు కిరీటాలు, రత్నాలు పొదిగిన స్వర్ణ సింహాసనాలు ఉన్నాయనీ చరిత్ర చెబుతోంది. ఇప్పుడు ఆ వివరాలన్నీ చెబుతారా? అన్నది చూడవలసి ఉంది. ఉత్కళ సామ్రాజ్యం మీద ముస్లిం దండయాత్రలు చాలాసార్లు జరిగాయి. అయితే నిధులు వారి బారిన పడకుండా జగన్నాథుని రహస్య గదుల్లోను, సొరంగ మార్గం గదుల్లోను దాచారని కూడా తెలుస్తోంది. ఆ వివరాలు కూడా బయటకు రావలసి ఉంది.

## అసలు తాళాలు మాయం?

రహస్య గది అసలు తాళాలు మాయమయ్యాయనీ, డూప్లికేట్ తాళాలను ఉపయోగించినా తెరచుకొనకపోతే వాటిని పగులగొట్టి అధికార బృందం లోపలికి వెళ్లిందనీ అంటున్నారు. అసలు తాళాలు ఎందుకు మాయమయ్యాయి? డూప్లికేట్ తాళాలు ఎవరు చేయించారు? అనే అంశాలపై తప్పక దర్యాప్తు జరిపించవలసి ఉంది. ఏదో విధంగా తాళాలు తెరచుకున్నాయి గదా అని వదిలేస్తే, ఎంతో సంపదకు సంబంధించిన వివరాలు పూర్తిగా మరుగున పడే అవకాశం ఉంది.

2018లో ఒకసారి హైకోర్టు భాండార్ తెరవాల్సిందిగా దేశాలు జారీ చేసింది. అయితే తాళాలు మాయమయ్యాయనే వంకతో రహస్య గదిని తెరవకుండా చేశారు. అనంత పద్మనాభస్వామి ఆలయంలో మాదిరిగా 'నాగబంధం' వంటిదేమీ లేకపోవడంతో భాండార్ గదులు తేలికగానే తెరవగలిగారు. అందుకే ఎక్కువ అనుమానించవలసి వస్తోందని కూడా పరిశీలకులు అంటున్నారు.

జులై 14, 18న రెండు పర్యాయాలు భాండార్ గదులను తెరచి తాము చూసిన నిధి నిక్షేపాల వివరాలు నిబంధనల ప్రకారం ప్రస్తుతం వెల్లడించలేమనీ, లెక్కింపు తర్వాతనే అన్ని వివరాలు తెలుస్తాయనీ ఒడిశా న్యాయ శాఖమంత్రి పృథ్వీరాజ్ అంటున్నారు. భాండార్ నుంచి అధికారులు నిధుల బాక్సులను బయటికి తెస్తుండగా ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి కూడా తర్వాత ఒక ప్రకటన చేస్తూ అన్ని వివరాలు పారదర్శకంగా ప్రజలకు వెల్లడిస్తామని అన్నారు. దీనినిబట్టి నిధికి సంబంధించిన వాస్తవాలు తప్పక వెలుగు చూస్తాయనే అనుకోవాలి.



## సొరంగ మార్గం ఎక్కడ ఉంది?

ఆలయంలోని రత్న భండార్ నుంచి రాజ ప్రాసాదం వరకు సొరంగ మార్గం ఉందనీ, ఆ మార్గం మధ్యంలో ఉన్న గదుల్లో అనంతమైన సంపద ఉందనీ చరిత్ర గ్రంథాలలో ఉంది. కానీ ఇప్పుడు ఆ మార్గం గురించి అధికారులు నోరు మెదపకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. జగన్నాథుడికి సేవలందించే జగన్నాథ స్వయిన్ మహాపాత్ర చెబుతున్న ప్రకారం కూడా సొరంగ మార్గం ఉన్నదనీ, దానిలో ఐదు రహస్య గదులున్నాయనీ తెలుస్తోంది. ప్రస్తుత పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ 1971లో కొత్త రాజప్రాసాదం నిర్మించారు. అంతకుముందు బలిసాహిలో పురాతన రాజమహల్ ఉండేది. ఈ కొత్త రాజప్రాసాదానికి కూడా సొరంగ మార్గం ఉన్నదనీ, పాత మహల్ నుంచి చాలా సంపదను రాజవంశీకులు ఈ కొత్త మహల్‌కు చేర్చారని కూడా తెలుస్తోంది. దానిపై సమగ్ర విచారణ జరగవలసి ఉంది. అసలు జగన్నాథుని సంపద ఎంతో తెలియాలంటే ఈ వివరాలన్నీ కూడా బహిర్గతం కావాలి. ఎఎస్ఐ(ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) దానిపై సమగ్ర పరిశోధన జరిపితే చాలా రహస్య విషయాలు వెలుగులోకి వస్తాయి.



## పూర్తిగా తేలని 'పద్మనాభుని' సంపద

తిరువనంతపురంలోని ప్రాచీన అనంత పద్మనాభస్వామి ఆలయంలోని నేలమాళిగలలో లక్షన్నర కోట్లు విలువ చేసే అపార సంపద బయల్పడినట్లు తొలుత వెల్లడించారు. 2012లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆ లెక్కింపు మొదలయింది. ఆరు మాళిగలలో చివరిది తెరిచే విషయం ఇంకా అస్పష్టంగానే ఉంది. వివాదాలు, ఊహాగానాలు నడుస్తూనే ఉన్నాయి. ఐదు మాళికగల్లోని సంపద ఇప్పటికి ఐదు లక్షల కోట్లు దాటిందనీ, ఇంకా పెరగవచ్చనీ అంటున్నారు. అక్కడి లెక్కింపు కూడా అసమంగ్రంగానే ఉంది. లెక్కింపును డిజిటలైజ్ చేయడానికి ప్రత్యేక యంత్రం రూపొందించారుగానీ ఎవరి అలసత్వమో, లేక ఇతర కారణాలేమిటోగానీ ఇంతవరకు పూర్తి వివరాలు బయటకు రాకపోవడం ఆశ్చర్యకరం. నేలమాళిగల్లో 1860లో మూసివేసిన కొన్ని గదులకు 1950లో సీల్ వేశారు. రాజకుటుంబీకుల పర్యవేక్షణలో ఉన్న ఆలయ సంపదను లెక్కించాలంటూ ఒక న్యాయవాది సుప్రీంకోర్టులో దావా వేయడంతో తేనెతుట్టె కదిలింది. బంగారు కొబ్బరికాయలు, బంగారు శంఖాలు కొన్ని డజన్ల సంఖ్యలో ఉన్న ఆలయ సంపద ఇంత అని చెప్పలేం. రెండు వేల కంఠాభరణాలు 'దొరికిన' జాబితాలోనే వున్నాయంటే వాటి విలువ లెక్కకట్టగలమా! 'నాగబంధం' రక్షణగా ఉన్న ఆరో గది కూడా తెరవగలిగితే బయల్పడే సంపదకు అంకెలు చాలవేమో! పూరీ జగన్నాథుని ఆలయం, తిరువనంతపురం అనంత పద్మనాభుని ఆలయం సంపదలే ప్రస్తుతం ఎంతో మిస్టరీగా వుంటే, ఇంకా అగళిత సంపద వున్న మిగిలిన ఆలయాల వరాలు తెలిస్తే మరింత ఆశ్చర్యం కలుగుతుంది. అందుకే మన దేశాన్ని 'సోనేకి చిడియా' అంటే 'బంగారు పిచ్చుక' అంటారు. అది నిజంగా నిజమే. పురాతన దేవాలయాలు, కోటలు, సొరంగాలలో ఇప్పటికీ దాగి వున్న సంపదను వెలికితీయగలిగితే, నిజాయితీగా దానిని బహిర్గతం చేయగలిగితే ఇండియాలో ప్రతిఒక్కరు బిలయనీరే అవుతారు. బీహార్‌లోని సోన్ భండార్ గుహలు, కర్ణాటకలోని మూకాంబిక ఆలయం, రాజస్థాన్‌లోని జైఘర్ కోట వంటిచోట్ల నిక్షిప్తమై ఉన్న నిధుల గురించి కూడా వెలుగులోకి రావలసి ఉంది. తిరుమలేశుని ఆలయం కూడా ఆ వరుసలోనిదే! ❑

# చిరకాల స్నేహం



ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జులై చివరి ఆదివారం లేదా మొదటి ఆదివారం ఈ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1958లో సౌత్ అమెరికాలో మొదటిసారి ఈ దినోత్సవం జరుపుకోబడింది. స్నేహం మన జీవితాల్లో ఎంతో ముఖ్యమైనది. స్నేహితులు మనకు సంతోషాన్ని, భద్రతను, సహకారాన్ని అందిస్తారు. స్నేహ దినోత్సవం చరిత్ర చాలా రసవత్తరంగా ఉంటుంది. మొదటిసారి, పారాగ్వేలో ఈ స్నేహదినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ దినోత్సవం ద్వారా స్నేహితుల మధ్య బంధం, ప్రేమ, సహకారం పట్ల అవగాహన పెంచే ప్రయత్నం జరిగింది. స్నేహితులు మనకు సంతోషాన్ని, భద్రతను, సహకారాన్ని అందిస్తారు. స్నేహితులతో మాట్లాడడం, వారి తోడ్పాటును పొందడం మానసిక ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తుంది. స్నేహితులు మన ఆందోళనలు, సమస్యలను విని, ఆ బాధల్లో నుంచి మనల్ని ఓదారుస్తూ మనసుకు ప్రశాంతతను కలిగిస్తారు. స్నేహం సమాజంలో బంధాలను బలపరుస్తుంది. స్నేహితులు కలిసి ఉన్నప్పుడు సామాజిక సంబంధాలు మెరుగుపడతాయి. స్నేహితులు కలిసి ఒకరి కష్టసుఖాలను ఒకరు పంచుకోవడం వల్ల మనసు ఉరటచెందుతుంది. స్నేహితులు అనేకరకాల సహాయం అందిస్తారు. ఇది ఆర్థికంగా కూడా ఉపయోగకరంగా ఉంటుంది. స్నేహితులు అవసరానికి సహాయం అందిస్తారు. కష్టాల్లో మనకు మొదటగా గుర్తుకు వచ్చేది స్నేహితులే. అవసరమైనప్పుడు ఆదుకునేది స్నేహమే. స్నేహం సమాజంలో బంధాలను బలపరుస్తుంది. స్నేహితులు అనేక రకాల సహాయం అందిస్తారు. ఇది ఆర్థికంగా కూడా ఉపయోగకరంగా





ఉంటుంది. స్నేహితులు అవసరానికి సహాయం అందిస్తారు. అది ఒక పెద్ద బలంగా మారుతుంది. స్నేహితుల సహకారం అనేక సందర్భాల్లో మనకు విజయాలను అందిస్తుంది.

భారతీయ సంప్రదాయంలో స్నేహం అనేది ముఖ్యమైన భాగం. మన సమాజంలో స్నేహానికి ఉన్న ప్రాముఖ్యతను గమనిస్తే భారతీయ పురాణాలలో స్నేహం గురించి అనేక కథలు ఉన్నాయి. కృష్ణ, సుధామ, రామ, సుగ్రీవ వంటి అనేక స్నేహకథలు భారతీయ సంప్రదాయంలో ప్రాధాన్యం పొందాయి. భారతీయ సాహిత్యంలో స్నేహం గురించి అనేక కవితలు, కథలు రాయబడ్డాయి. భారతీయ సినిమాల్లో స్నేహం గురించి అనేక కథలు చూపించబడ్డాయి. భారతీయ సామాజిక జీవితంలో స్నేహం ఒక ప్రధానమైన భాగం. స్నేహితులు కలిసి ఆడడం, గడపడం ఒక సంప్రదాయం. అయితే మంచి స్నేహితులను కలిగి ఉండడం చాలాముఖ్యం. చెడ్డస్నేహితుల వల్ల చెడు అలవాట్లకు గురిచేసి, జీవితాలను పాడుచేస్తారు. కాబట్టి మంచి స్నేహితులకు దగ్గర కావాలి, చెడుస్నేహాలను ఆదిలోనే తుంచివేసుకోవాలి. వారికి దూరంగా ఉండాలి. స్నేహం అనేది ఎదుటివారి క్షేమాన్ని, సమాజహితాన్ని కోరుతుంది. మన స్నేహం అనేకులకు ఆదర్శవంతం కావాలి.

**– డాక్టర్ చిట్యాల రవీందర్**

# పచ్చదనంతో ఆరోగ్యం

‘పచ్చదనాన్ని ఎప్పుడు చూసినా మనస్సుకి హాయిగా ఉంటుంది. ఆ ప్రశాంతత కారణంగా గుండెపోటు రాదు..’ అని చెప్పడం కాదు ఈ పరిశోధన ఉద్దేశం. మనకు దగ్గరగా ఉన్న పార్కునో, చెరువునో చూస్తే ‘కాసేపు అక్కడికి వ్యాహ్యాళికి వెళదాం’ అన్న ఆలోచన వస్తుందట. ఆ పాటి చిన్న వ్యాయామమే గుండె ఆరోగ్యానికి పెద్ద సాయం చేస్తోందని చెబుతున్నారు. నార్త్‌వెస్టర్న్ వర్సిటీ శాస్త్రవేత్తలు. ఊరికే చెప్పడం కాదు– అమెరికాలోని ఐదు ప్రధాన నగరాలకి చెందిన మూడువేల మంది పౌరులపైన ఇందుకోసం పరిశోధన చేశారు. ఓ చక్కటి ఉద్యానవనం దగ్గరో, చెరువు సమీపానో జీవిస్తున్నవాళ్లలో– గుండెపోటుకి మూలమైన బృహద్ధమని పూడిక (కరోనరీ ఆర్టెరి క్యాల్సిఫికేషన్–సీఏసీ) సమస్య తక్కువగా ఉందని వీళ్ల తేల్చారు. మిగతావాళ్లతో పోలిస్తే పచ్చదనానికి దగ్గరగా ఉన్నవాళ్లలో ‘సీఏసీ’ సమస్య 35శాతం, నీటి వనరుల సమీపాన ఉన్నవాళ్లలో 32శాతం తక్కువగా ఉన్నట్టు తేల్చారు.



# మార్కెట్లో కొత్తగా..



## పంటలకు రోబో రక్షణ

**పంటలను** కాపాడుకోవడం ఎంత కష్టమో రైతులకే తెలుసు. నాట్లు నాటడం, నీరు పట్టడం, చీడపీడలు సోకకుండా వేళకు మందులు చల్లడం, కలుపు తీయడం వంటి పనులు చేయడానికి చిన్నాచితకా యంత్రాలు అందుబాటులోకి వచ్చినా, ఇవేవీ మానవ శ్రమ నామమాత్రంగానే తగ్గించగలిగాయి. రోబోటిక్ పరిజ్ఞానం వ్యవసాయరంగంలోకి ఇప్పుడిప్పుడే అడుగుపెడుతోంది. అందుకు ఉదాహరణే ఈ పరికరం. ఇది క్రాప్ స్కౌటింగ్ రోబో. ఈ రోబో పంటకు అడుగడుగునా కాపలాగా ఉంటుంది. ఫ్రాన్స్‌కు చెందిన 'మెరోపీ' అనే కంపెనీ ఈ రోబోను 'సెంటివి' పేరుతో రూపొందించింది. ఇది పొలంలో తిరుగుతూ పంటలకు సోకిన చీడపీడలను వెనువెంటనే గుర్తించగలదు. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు పీకి పారేయగలదు. ఇది పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. రెండు వైపులా అమర్చిన కెమెరాలు, ఇందులోని సెన్సర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సహాయంతో పనిచేస్తాయి. ఈ రోబో పంటకు అన్నిరకాలుగా రక్షణ కల్పించగలదు. దీని ధర 5వేలు.

## దోమలను తరిమికొట్టే లాంతరు

**దోమల** బెడదను తప్పించుకోవడం చాలా కష్టం. మస్కిటోకాయిల్స్, మస్కిటో రిపెల్లర్స్ వంటివి ఎన్నో వాడుతుంటాం. వాటివల్ల దోమల బెడద తగ్గేసంగతి ఎలా ఉన్నా, కొందరికి వీటి నుంచి వెలువడే వాసన సరిపడదు. ముఖ్యంగా మస్కిటో కాయిల్స్ నుంచి వచ్చే పొగవల్ల ఉక్కిరిబిక్కిరై కొందరు ఇతర ఆరోగ్య సమస్యల బారిన కూడా పడుతుంటారు. మనుషులపై ఎలాంటి దుష్ప్రభావాలు చూపకుండా, దోమలను ప్రభావవంతంగా తరిమికొట్టే టూ ఇన్ వన్ మస్కిటో రిపెల్లర్‌ను అమెరికన్ కంపెనీ 'థర్మాసెల్' ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. ఈఎల్-55 పేరుతో రూపొందించిన ఈ పరికరం ఒకవైపు బెడ్‌లైట్ లాంతరుగా, మరోవైపు దోమలను తరిమికొట్టే మస్కిటో రిపెల్లర్‌గా కూడా పనిచేస్తుంది. ఇది రీచార్జబుల్ పరికరం. యూఎస్‌బీ పోర్టబుల్ ద్వారా దీనిని ఛార్జ్ చేసుకోవచ్చు. పూర్తిగా ఛార్ చేసుకుంటే, ఇది పన్నెండు గంటల సేపు నిరంతరాయంగా పనిచేస్తుంది. దీని ధర రూ.7,097.




## లాంగ్‌రేంజ్ ఈ-బైక్

ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ బైక్‌లు చాలా దేశాల్లో విరివిగా వాడుకలోకి వచ్చాయి. రీచార్జబుల్ బ్యాటరీలతో పనిచేసే ఈ-బైక్‌లు సాధారణంగా ఏకధాటిగా 40 నుంచి 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలవు. అయితే, స్విట్జర్లాండ్‌కు చెందిన మోటారువాహనాల తయారీ సంస్థ 'ఫ్యూయెల్' ప్రపంచంలోనే తొలి లాంగెస్ట్‌రేంజ్ ఈ-బైక్‌ను రూపొందించింది. దీని బ్యాటరీని ఒకసారి పూర్తిగా చార్జ్ చేసుకున్నాక ఇది ఏకధాటిగా 180 కిలోమీటర్ల దూరం ప్రయాణించ గలదు. ఇది పట్టణ ప్రాంతాల్లోని సమతలమైన రోడ్లమీదనే కాకుండా కొండ ప్రాంతాల్లోని ఎగుడుదిగుడు దారుల్లో కూడా సునాయసంగా ప్రయాణించగలదు. 'ఫ్యూయల్' కంపెనీ ఈ-బైక్‌ను 'ఫ్లూయిడ్-2', 'ఫ్లూయిడ్-3' అనే మోడల్స్‌లో అందుబాటులోకి తెచ్చింది.



# ఈవారం కవిత్వం



# గులాబీ నవ్వు

**పూలమొక్క** కొందామని
తోటకెళ్లాను
ఎన్నో రంగుల పూలు
ఎంతో అందంగా.
దేన్ని చూడాలో! ఏది కొనాలో!
నాలో నాకే సందిగ్ధం?
చివరిగా..
ఒకదానిపై చూపు మళ్లింది
ఎంత అందంగా ఉందో
ఎర్రగులాబీ!
దగ్గరికెళ్లాను
నా వైపు చూసి నవ్వింది
ఆ నవ్వులో జీవం లేదు
తాకబోయాను
కన్నీళ్లు పెట్టుకుంది
కారణమడిగా..
నేటితో తోటకూ.. నాకూ...
రుణం తీరబోతుందని
సాటి మొక్కలతో స్నేహం వీడబోతుందని
గులాబీ తన గుబులంతా చెప్పేసింది.
మరొక్కసారి తోటంతా
చూపులు పరిచా
నా నిర్ణయం మారింది
బయటకొచ్చాను.
తోటను వీడి నేను
తిరిగి వెళుతూ/ వెనక్కి తిరిగా..
తోటలో గులాబీ
నవ్వుతూ నా వైపే చూస్తోంది
ఆ నవ్వులో ఇప్పుడు
జీవం కనిపిస్తోంది
సహజత్వం ఉట్టిపడుతోంది.


– ఎ.నాగాంజనేయులు

# ఎందుకు బాధపడుతున్నావ్?

**ఎందుకు** బాధపడుతున్నావ్
ఈ దేహం ముసలిదైపోయింది
అవును.. ఇక్కడ ప్రతిదానికీ ఓ కాలపరిమితి ఉంది
ఆమనిలో చిగురించే ఆకు
శిశిరంలో నేల రాలాల్సిందే
ఉదయం ఉన్న చైతన్యం రాత్రికి సుప్తావస్థకి
వెళ్లాల్సిందే
ఈ చెట్టుకొండలు జీవులు అన్నీ
కాలగర్భంలో కలిసిపోయేవే
మార్పు అనివార్యం
ఇంతదానికి ఎందుకు బతకడం
ఈ కష్టాలు కన్నీళ్లు చిక్కుముడులు ఎందుకు
అవన్నీ నువ్వు సృష్టించుకున్నవే
పామరుడిని చూడు
వాడు జీవితాన్ని చక్కగా అనుభవిస్తున్నాడు
ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమే జీవితం
మరి ఇప్పుడేం చేయడం
నీదైన జీవితాన్ని జీవించి
నీవైన కొన్ని జ్ఞాపకాలు వదిలివెళ్లడమే.

– పల్లా వెంకట రామారావు





# జీవనయానంలో రామాయణ మహత్యం

'రామాయణ మార్గదర్శనం' సామెత కథా ప్రక్రియలో బిందుమాధవి మద్దూరి, రచించిన 24 కథల సంకలనం. వ్యక్తిత్వవికాసం దృష్టిలో పెట్టుకొని రచయిత్రి, రామాయణంలోని చిన్నచిన్న సంఘటనలను సామెత కథలుగా రాసారు. కేవలం ప్రవచనాలు వినడమే కాకుండా, ఆ సారాన్ని చిన్నచిన్న కథలుగా రూపొందించి, అందరికీ ఆసక్తి కలిగేవిధంగా వెలువరించడం ఈ సంపుటి ప్రత్యేకత. ఈ మార్గదర్శన కథలు బాలబాలికలకు, యువతీ యువకులకు నిత్యజీవితంలో వ్యక్తిత్వ వికాసానికి సందేశాత్మకంగా సూచనలు అందిస్తున్నాయి. 'పూర్వభాషే'లో సుగుణ లక్షణం గురించిన వివరణ, రచయిత్రి పరిశీలనాత్మక ప్రతిభను తెలియచేస్తోంది. యథాలాపంగా చదవడం, శ్రీరామచంద్రుని మహోన్నత వ్యక్తిత్వాన్ని ప్రశంసించడంతో కాకుండా, రచయిత్రి, తాను అవలోకించిన నిగూఢ అంశాలను నిజజీవన వికాసానికి అన్వయింపచేసారు. తల్లిదండ్రులకు గురువులతో సమన్వయంగా వ్యవహరించే అవసరం గురించి 'గురువు', నిగ్రహం కోల్పోతే ఎలాంటి విపరీత పరిణామాలు, ఆకృత్యాలకు లోనవలసి వుంటుందో, 'విచక్షణ'లో వివేకం పోగొట్టుకొని ఆపద తెచ్చుకోవద్దని సూచిస్తూనే ఆడపిల్లలు స్వీయరక్షణకు కరాటే వంటి విద్యలు నేర్చుకోవాలని రచయిత్రి హితవు అందించారు. త్రేతాయుగంనాటి శ్రీమద్రామాయణ మహోన్నతతో సంధానం చేసి సమాజ కల్యాణాన్ని, జీవన శ్రేయస్సు ఆకాంక్షించిన, ఈ కథన సంపుటి అభినందనీయంగా వుంది. **(రామాయణ మార్గదర్శనం, రచన: బిందుమాధవి, వెల: రూ 150, ప్రతులకు: ఫ్లాట్, 402, శ్రీముఖ రెసిడెన్సీ, 8-3-1027/2/ఎ, హైదరాబాద్)** **– యర్రమిల్లి**

# రాజులు బూజులు-చదువుల సారం



కాలంతో సంభాషణ అంటూ ఎం.రాఘవాచారి చక్కటి విలువైన ముందుమాట రాసారు. రాజస్థాన్ నుండి తంజావూర్-మధుర దాకా పలు ప్రాంతాలు రాజప్రాసాదాలు సందర్శిస్తూ వాటిని విశ్లేషిస్తూ నేటి స్థితిగతులు, రాజ్యాంగం పూర్వకాల ఆచారవ్యవహారాలు, ప్రపంచీకరణతో వచ్చిన మార్పులు, వ్యాసాల రూపంలో అందించారు రచయిత. బిగ్‌బ్యాంగ్ థియరీ నుండి నేటి పరిస్థితులదాకా క్లుప్తంగా, క్షుణంగా అధ్యయనవాదులకు, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తకరంగా వ్యాసాలున్నాయి. చరిత్ర అధ్యయనం క్రీ.పూ. 10500 నుండి క్రీ.పూ 4500-2000 దాకా నియోలిథిక్ (కొత్తరాతియుగం) ఎరా అంటారు. క్రీ.పూ.2,900 నుండి క్రీ.పూ 1150 వరకు కంచు యుగం. క్రీ.పూ.1100 నుండి ఇనుపయుగం ప్రారంభమైంది. క్రీ.పూ 500 నుంచి ఈజిప్ట్‌లో సుమేరియన్ నాగరికత వెల్లివిరిసింది. ప్రజలు అకాడియన్ భాష మాట్లాడే వారు (పేజీ.55). ప్రజల సొమ్ము పాలకుల సోకు అన్న వ్యాసం లో క్రీ.పూ 1500 సంవత్సరకాలం నాటికి కురపాంచాల ప్రాంతా ల్లో వైదిక ఆర్యుల కాలం ఆరంభం అయింది. (పేజీ.51) త్యాగా ల తెలంగాణ వ్యాసంలో 1997 వరంగల్ డిక్లరేషన్‌కు కాళోజీ, సాయిబాబ, వరవరరావు, ప్రొ॥జయశంకర్ వంటి పెద్దలు చేసిన తీర్మానాలు, ఆకుల భూమయ్య కన్వీనర్‌గా తెలంగాణ జనసభ ఆవిర్భాం, చెల్లి లలిత హత్యలాంటి విషయాలు 2001 లో అధికారమే పరమావధిగా రాజకీయ పార్టీ తెరమీదకు వచ్చింది. **(రాజుల బూజులు- చదువుల సారం, రచన: వీరగోని పెంటయ్య, వెల: రూ 120, ప్రతులకు: వి.లక్ష్మి, 9-1-217, కరీంనగర్)** **– తంగిరాల చక్రవర్తి**


**పుస్తక సమీక్ష**

# సముద్రతీరాన విహరిద్దాం రండి!



'నానీ' ప్రక్రియ ద్వారా కవనలోకంలోకి అడుగిడుతున్న మరో యువకవి శివకృష్ణ కొక్కుల. విశాఖపట్నం వాసి. మరి యికనేం..సముద్రం ఆవహించింది కాబోలు, సింహభాగం కవితలు సముద్రం గురించి రాసి తన లఘుకవితల్ని 'సముద్రనానీలు' గా అభివర్ణిస్తున్నాడు. అల్పాక్షరాలతో ఆ నవ్వార్థాన్ని సాధించడమే 'నానీ' లక్ష్యం. 'చరుపు' దీని ప్రత్యేక లక్షణం. 'వచ్చిపోయే అల/ ఒక్కో పేజీ/ అలా నేను సముద్రాన్ని/ చదువుతున్నాను' సముద్రాన్ని చదవడమే గాదు..సముద్రాన్ని వింటున్నాడని కూడా శివకృష్ణ నానీలు తెలియజేస్తాయి. 'తీరానికి అవతల/ బడి ఉందేమో/ వెళ్లనని/ మారం చేస్తూ అలలు' సముద్రం ఈడ్చుకొచ్చిన అలలు అంతేవేగంగా వెనక్కి తరలి వెళ్లడం ఓ అద్భుత దృశ్యం. మారం చేసినా అబ్బురం కలిగిస్తుంది. 'సముద్రం/ ఒక మహాగ్రంథం/వర్షాలు, నదులు/ జంట రచయితలు' సముద్రపు ఉనికిని తెలియజేస్తున్నాడు కవి. రచయితలే లేకపోతే గ్రంథాలెక్కడివన్న ప్రశ్న కవిది. 'ఆకాశం తొడిగింది/ చుక్కల చొక్కా/ మరి బొత్తాము?/ చందమామే!' అంటూ రాసుకున్నాను నేను ఓ నానీలో. శివకృష్ణ ఏమంటున్నాడో చూడండి. పాఠకుల్ని హాయిగా సముద్రతీరాన విహరింప చేస్తాయనడంలో సందేహం లేదు. **(సముద్ర నానీలు, రచన: శివకృష్ణ కొక్కుల, వెల: రూ 120, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)** **– రమణ వెలమకన్ని**

# బౌద్ధం మతం కాదు, మానవధర్మం



ప్రపంచంలో రెండు రకాల మనుషులుంటారు, ఒకరు తాము బౌద్ధులమని తెలిసి బ్రతుకుతున్నవారు. ఇంకొకరకం తాము బౌద్ధులమని తెలియకనే, బౌద్ధులుగా బ్రతుకుతున్నవారు. 'మానవీయత, కరుణ, ప్రేమ ఎవరిలో ఉన్నా వారు బౌద్ధులే' అంటారు మానవీయత మూర్తీభవించిన రచయిత కాలువమల్లయ్య. బౌద్ధమతం గురించి వివరిస్తూ, అది ఒక మతం కాదని, జీవనవిధానమని అంటారు. సమస్త జీవరాశుల కోసం దుఃఖరహిత జీవితం కోసం మనిషి ఏమి ఆచరించాలో బౌద్ధమతం చెబుతుంది. హిందూమతం, ఇస్లాము, క్రైస్తవం దైవానికి ప్రాధాన్యమిస్తుంది. కాని బౌద్ధం మానవత్వానికి ప్రాధాన్యమిస్తుందని రచయిత వివరిస్తారు. ఈ గ్రంథంలో వివరించిన ఆణిముత్యాలు అన్నదగ్గ కొన్ని జీవనసూత్రాలు: అసూయస్వార్థం, ద్వేషం, కోరికలను త్యజించాలి. సమాజం ఎలా ఉందోకాదు, ఎలా ఉండాలో చెప్పాలి, సమాజాన్ని మార్చటానికి మార్క్స్ తుపాకిని ఇస్తే బుద్ధుడు నైతిక ధర్మాన్నిచ్చాడు. కాలువ మల్లయ్య రచయిత మాత్రమేకాదు, జ్ఞాని ప్రజ్ఞాని. **(విశ్వమంటే బోధిసత్వుడే.....రచన: డా॥కాలువ మల్లయ్య, వెల: రూ 200, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)** **– కూర చిదంబరం**

# అగ్నిభూమి అజర్‌బైజాన్

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

**దక్షిణ** కాకసస్ ప్రాంతంలోని అతిపెద్ద దేశం అజర్‌బైజాన్. ఇక్కడ జనాభా కూడా అత్యధికంగానే ఉంటుంది. దీని అధికారికనామం రిపబ్లిక్ ఆఫ్ అజర్‌బైజాన్. ఆ దేశం పాక్షికంగా తూర్పు, ఐరోపాలోనూ, పాక్షికంగా పశ్చిమ ఆసియాలోనూ నెలకొని ఉంది. తూర్పున కాస్పియన్ సముద్రం, దక్షిణాన ఇరాన్, పశ్చిమాన ఆర్మేనియా, ఆయువ్యాన జార్జియా, ఉత్తరాన రష్యా దీని సరిహద్దులుగా ఉన్నాయి. ఈ దేశానికి చెందిన అనేక దీవులు కాస్పియన్ సముద్రంలో ఉన్నాయి. వాయవ్యంలో అతిస్వల్పంగా టర్కీ సరిహద్దు ఉంటుంది. అజర్‌బైజాన్‌లో 4వేల సంవత్సరాల నుండి మంటలు విరజిమ్మే పర్వతం, వందలాది మట్టి అగ్నిపర్వతాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



## మండే పర్వతం

దాదాపు నాలుగువేల సంవత్సరాల నుండి పర్వతం మంటలను విరజిమ్ముతుంది. నాటి నుండి నేటి వరకు ఏనాడూ ఈ మంటలు ఆరలేదు. అనునిత్యం అగ్నిజ్వాలలను విరజిమ్ముతూ ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. ఆ పర్వతం పేరు యనార్ దాగ్. ఇది అజర్‌బైజాన్ దేశ రాజధాని బాకు నగరానికి ఈశాన్యంగా 25 కి.మీ. దూరంలో కాస్పియన్ సముద్రంలోని అబ్షెరాన్ ద్వీపకల్పంలో చిన్న పర్వతాలపై నెలకొని ఉంది. అజర్‌బైజాన్ అనేది పశ్చిమ ఆసియా, తూర్పు ఐరోపా కూడలిలో ఉన్న ఒక గొప్ప పర్యాటక ప్రదేశం. యనార్ దాగ్ అనేది మండే పర్వతం. యనార్ అంటే మంటలు, దాగ్ అంటే పర్వతం. వెరసి మండే పర్వతం. 4వేల సంవత్సరాల నుండి ఈ చిన్న పర్వతం నుండి మంటలు ఎగసి పడుతున్నాయి. ఆ కారణంగా దీనిని ల్యాండ్ ఆఫ్ ఫైర్ అని పిలుస్తారు. ఇటువంటివే కొన్ని దేశాలలో కనిపిస్తే మహిమ, మంత్రం అంటూ మతాలను ఆపాదించి గజిబిజి గందరగోళం చేసి మూఢనమ్మకాలను



పెంచేస్తుంటారు. ఆ కోవకు చెందిన కొందరు దీన్ని పవిత్ర స్థలంగా భావించి మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇరాన్‌కు చెందిన పురాతన జొరాస్ట్రియన్ ప్రజలకు ఇది ఆరాధన కేంద్రంగా ఉండేది. వీరు అగ్నిని పూజించడాన్ని విశ్వసిస్తారు. కానీ ఇక్కడి శాస్త్రవేత్తలు మంటలు రావడానికి అసలు కారణం చెబుతున్నారు. ఇక్కడ భూమిలో ఉన్న కొన్ని సహజ వాయువులు, మీథేన్ వాయువు, హైడ్రోకార్బన్ వాయువు నిల్వల కారణంగా నిత్యం ఈ పర్వతం నుండి మంటలు వస్తుంటాయి. విపరీతమైన వర్షం కురుస్తున్నా ఈ మంటలు ఆరవు. 13వ శతాబ్దానికి చెందిన వెనిస్ వర్తకుడు మార్కోపోలో ఈ ప్రాంతం గుండా వెళుతూ ఈ మంటల గురించి తన రచనలలో ప్రస్తావించాడు.

యానార్ దాగ్ కొండ నుండి కేవలం మంటలే ఎగసి పడుతుంటాయి. అగ్నిపర్వతం పేలినప్పుడు వచ్చేలావా వంటి పదార్థం బయటకు రాదు. ఈ కొండ ఎత్తు 2,800 అడుగులు. ఒక సన్నని పోరస్ ఇసుకరాయి పొరలకున్న చిన్న బిలాల నుండి 3 మీటర్ల ఎత్తువరకు మంటలు గాలిలోకి ఎగసిపడుతుంటాయి. మంటలు ఎగసిపడే భాగం 15 మీటర్ల పొడవు ఉంటుంది. ఇక్కడి వాతావరణం దుర్వాసనతో పాటు పెట్రోలు వంటి ఇంధనాల వాసనతో నిండి ఉంటుంది. సహజంగా ఎగసిపడే ఈ శాశ్వత మంటలు సంధ్యా సమయంలో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. మంటలను నీటితో ఆర్పవచ్చనేది అందరికీ తెలిసిన విషయమే. ఇక్కడ ఎంత వర్షం కురిసినా, విపరీతంగా మంచు కురిసినా, తుపాన్‌లు వచ్చినప్పటికీ నాలుగువేల సంవత్సరాల నుండి అవిశ్రాంతంగా, నిత్యం ఈ శాశ్వత జ్వాలలు ఎగసి పడుతూనే ఉన్నాయి. భారతీయులు ఇక్కడకు ఎక్కువగా వచ్చి పూజలు చేసుంటారు.

ఎగసిపడే ఈ మంటల్లో నాణేలు వేస్తే కోరుకున్న కోరుకలు నెరవేరతాయని విశ్వసిస్తుంటారు. కొందరితే ఆ మంటలు రెండువేల సంవత్సరాల నుండి, కాదు మూడువేల సంవత్సరాల నుండి, కేవలం 1947 నుండి మాత్రమే ఇక్కడ మంటలు ఎగసి పడుతున్నాయి అని కథనాలు ప్రచారం చేసేవారు కూడా లేకపోలేదు.



ఇంకొందరి వాదన ప్రకారం 1950లో ఒక గొర్రెల కాపరి ధూమపానం చేయడానికి నిప్పును రాజేయడం వల్ల ఇక్కడ మంటలు చెలరేగాయనే వాదనలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా ఈ మంటలు 4వేల సంవత్సరాల నుండి ఎగసి పడుతున్నాయనేది శాస్త్రవేత్తలు మాటల ద్వారా, చారిత్రాత్మక ఆధారాల వల్ల తెలుస్తుంది. కానీ అజర్‌బైజాన్ చరిత్రకారులు నాలుగువేల సంవత్సరాల నుండి ఈ పర్వత బిలాల నుండి మంటలు ఎగసి పడుతున్నాయని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇక్కడ విపరీతమైన వేడి ఉంటుంది. మంచు విపరీతంగా కురిసే చలికాలంలో సైతం ఇక్కడ వెచ్చని వాతావరణం ఉంటుంది. ఒక కర్రముక్క తీసుకుని ఈ పర్వతంపైన ఉన్న మట్టిని గీరినట్లైతే లైటర్‌ను పోలిన చిన్నపాటి మంట క్షణకాలం కనిపిస్తుంది. అంటే ఇక్కడి భూమిలో అన్ని సహజవాయువు, ఇంధన నిల్వలుఉన్నాయన్న మాట. అలెగ్జాండర్ దుమాస్ ఒకసారి ఈ ప్రదేశాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది. జోరాస్ట్రియన్‌లు ఇక్కడ అగ్నికి దేవాలయం కట్టినట్లు అలెగ్జాండర్ దుమాస్ అప్పట్లో పేర్కొన్నారు.

## మట్టి అగ్నిపర్వతాలు అగ్నిభూమి అజర్‌బైజాన్

ఏ దేశంలో లేనన్ని మట్టి అగ్ని పర్వతాలు అజర్‌బైజాన్ దేశంలో ఉన్నాయి. ఆ కారణంగా దీనికి అగ్నిభూమి అని కూడా పిలుస్తారు. ప్రపంచంలోని 700 మట్టి అగ్నిపర్వతాలలో 350 వరకు అజర్‌బైజాన్ రిపబ్లిక్‌లో ఉన్నాయి. స్థానిక భాషలో ఈ మట్టి అగ్నిపర్వతాలను పిల్పిలా అని పిలుస్తారు. అజర్‌బైజాన్‌లో భూగర్భ మట్టి అగ్నిపర్వతాలే కాక సముద్ర జలాలలో సైత మట్టి అగ్నిపర్వతాలు ఉన్నాయి. కాస్పియన్ సముద్రంలో 140 కంటే ఎక్కువ జలాంతర్గామి అగ్నిపర్వతాలు ఉన్నాయి. ఇక్కడి అగ్నిపర్వతాలు కొన్నివేల సంవత్సరాల నాటివని తెలుస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద మట్టి పర్వతాలుగా పేర్కొన్న బోయుక్ ఖనిజాదాగ్, తురాఘై అజర్‌బైజాన్‌లో ఉన్నాయి. 5 సెప్టెంబర్ 2004లో ఇవి ఎత్తైన మట్టి అగ్నిపర్వతాలుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందాయి. ఇక్కడి మట్టి అగ్నిపర్వతాల ఎత్తు 20 నుండి 400 మీటర్ల వరకు ఉంటుంది. కొన్నిమట్టి అగ్ని పర్వతాలు 100 నుండి 4500 మీటర్ల ఎత్తును కూడా కలిగి వుండటం విశేషం. మట్టి అగ్నిపర్వతాలు చమురు క్షేత్రాలతో సంబంధం కలిగి ఉంటాయి. లోక్‌బాటన్, గరదాగ్, నెఫ్ట్ దష్లారి, మిషోన్‌దాగ్ ఇత్యాదివి కొన్ని మట్టి పర్వతాల పేర్లు. ఇవి ఉన్న భూభాగాల్లో చమురు, సహజవాయు క్షేత్రాలు కనిపిస్తాయి. మట్టి అగ్నిపర్వతాల ద్వారా విస్ఫోటనం చేయబడిన లావా, మట్టి, ద్రవం రసాయన, నిర్మాణ పరిశ్రమలతోపాటు ఫార్మకాలజీలో ముడిపదార్థాలుగా ఉపయోగిస్తున్నారు. ఇవి పేలినప్పుడు వచ్చే బురద, ఇతర పదార్థాలలో వందకంటే ఎక్కువ ఖనిజాలు, పాదరసం, మాంగనీస్, రాగి, లిథియం ఇత్యాది 30వరకు రసాయన సూక్ష్మమూలకాలు ఉన్నట్లు గుర్తించారు. మట్టి అగ్నిపర్వతం పేలినప్పుడు వ్యాపించిన బురద దాదాపు 12 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. మట్టి అగ్నిపర్వతాలు విస్ఫోటనం చెందినప్పుడు బురద పెద్దపెద్ద బుడగల్లా పైకివచ్చి కాలువలా ప్రవహించి ఈ ప్రాంతమంతా విస్తరిస్తుంది. అజర్‌బైజాన్‌లోని 23మట్టి అగ్నిపర్వతాలు జాతీయ ఉద్యానం హోదాను పొందాయి. ప్రభుత్వ పర్యవేక్షణలో వీటిని రక్షిస్తున్నారు. మట్టి అగ్నిపర్వతం నుండి బయటకు వచ్చిన బురద అక్కడక్కడా చిన్న స్నాన కొలనులా ఏర్పడుతుంటాయి. పర్యాటకులు ఇందులో దిగి ఆ బురదను ఒంటికి పూసుకుని కొద్దిసేపు అందులోనే ఉంటారు. ఈ బురదలో ఔషధ గుణాలున్నాయని పర్యాటకులు విశ్వసిస్తారు. ఇలా బురదను ఒంటికి పూసుకోవడం వల్ల కేంద్రనాడీ వ్యవస్థ, జీర్ణాశయంలోని పేగులకు మేలు కలగడంతో పాటు చర్మవ్యాధులు దూరమౌతాయని జనం బలంగా నమ్ముతారు. 1810 నుండి అజర్‌బైజాన్ రిపబ్లిక్ భూభాగంలోని అగ్నిపర్వతాలలో సుమారు 200 విస్ఫోటనాలు సంభవించాయి. మట్టి అగ్నిపర్వతాల విస్ఫోటనం బలమైన పేలుళ్లు, భూగర్భ గర్జనలతో కూడి ఉంటుంది. భూమి లోతైన పొరల నుండి వాయువులు బయటకు వచ్చి వెంటనే మండుతాయి. అగ్నిపర్వతం మీద జ్వాల ఎత్తు 1000 మీటర్ల ఉంటుంది. తోరాగే అగ్నిపర్వతం 1841 నుండి 1950 వరకు 6సార్లు పేలింది. అనేక మట్టి అగ్నిపర్వతాలు పలు మార్లు పేలిన సందర్భాలు ఉన్నాయి. వాటిలో కొన్ని మట్ట అగ్నిపర్వతాల గురించి తెలుసుకుందాం.



**గోటూర్ దాగ్:** ఈ అగ్నిపర్వతం అజర్‌బైజాన్ రాజధాని నగరం బాకు నుండి 70 కి.మీ దూరంలో ఉంది. దీని ఎత్తు 150 మీటర్లు. బిలం లోతు 20 మీటర్లు. 1966 నుండి 1970 మధ్యప్రాంతంలో ఇక్కడ విస్ఫోటనాలు జరిగాయి.

**బహేర:** ఇది బాకు నుండి 55కి.మీ దూరంలో ఉంది. ఈ మట్టి అగ్నిపర్వతం ఎత్తు 45 మీటర్లు. 1993లో ఇక్కడ విస్ఫోటనం జరిగింది.

**లోక్బాటన్:** ఇది అజర్‌బైజాన్ రాజధాని నగరం బాకు నుండి 15 కి.మీ. దూరంలో ఉంది. 19వ శతాబ్దంలో దాదాపు 17సార్లు ఇక్కడి అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది. చివరిసారి 2001లో ఇది విస్ఫోటనం చెందింది.

**ఐరాంటెకెన్:** ఇది అజర్‌బైజాన్‌లో అత్యంత చురుకైన అగ్ని పర్వతంగా పరిగణిస్తారు. ఇక్కడ అనేక పర్యాయాలు విస్ఫోటనం చెందడంతో భారీ మంటలతో కూడిన పేలుళ్లు సంభవించాయి. ఈ మట్టి అగ్నిపర్వతం ఎత్తు 190 మీటర్లు.







కథ

# ఇద్దరు విజేతలు

అల్లవరం, జొన్నగిరి అనే రెండు గ్రామాల మధ్య స్వర్ణసింధు అనే నది ప్రవహిస్తోంది. దసరా ఉత్సవాలలో భాగంగా ఆ నది మీద ప్రతి సంవత్సరం ఈతల పోటీలు జరుగుతుంటాయి. ఈ ఈతల పోటీలు నిర్వహించేది అల్లవరం గ్రామపెద్ద రంగరాయుడు.
అతనికి ఈతల పోటీలు అంటే చాలా సరదా. విజేతలను అప్రకటిత భారీ బహుమతులతో సత్కరించడం అతని అలవాటు.
ఆరోజు ఈతల పోటీలను తిలకించడానికి జనం తండోప తండాలుగా చేరుకున్నారు. పోటీదారులు అల్లవరం గట్టు నుంచి జొన్నగిరి గట్టుకు ఎవరు ముందు చేరు కుంటారో వారే విజేతలు. ఆరోజు స్వర్ణసింధు నది సాధారణ స్థితికన్నా ఎక్కువ వేగంతో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహానికి భయపడి కొంత మంది పోటీ నుంచి విరమించుకున్నారు. అత్యంత ధైర్యసాహసాలు ఉన్న పదిమంది యువకులు పోటీలో పాల్గొనడానికి సంసిద్ధులయ్యారు.
నిర్ణీత సమయం రాగానే అల్లవరం గ్రామపెద్ద, పోటీ లు ప్రారంభిస్తున్నట్టుగా పచ్చజెండా ఊపాడు. పోటీదారులందరూ ఉత్సాహంగా నదిలోకి దూకారు. గెలవబోయేది నేను అంటూ ఒకరిని దాటుకొని మరొకరు ముందుకు వెళుతుంటే, వారిని దాటుకొని ఇంకొకరు ముందుకు దూసుకుపోతూ ఇలా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి.
వెళ్లవలసిన దూరంలో మూడువంతులు అధిగమించిన పిమ్మట, ఒక దుస్సంఘటన జరిగింది. సురేంద్ర అనేవాడు గెలవాలని తాపత్రయంలో శక్తికి మించిన ప్రయత్నం చేసి ముందుకు దూసుకుపోయాడు. శక్తికి మించి ప్రయత్నించడమే పెద్ద తప్పు అయింది. బాగా అలసిపోయి నీళ్లు తాగేశాడు. ఇక ఏమాత్రం ముందు కు సాగలేని స్థితిలో మునకలు వేయసాగాడు. అతడు మునిగిపోయి చనిపోయేందుకు ఎక్కువ వ్యవధి లేదు. వీక్షకులలో ఆందోళన మొదలైంది.
'అయ్యో, అయ్యో' అంటూ కేకలు వేశారు. కాస్త వెనక వస్తున్న విమలుడనే పోటీదారుడు సురేంద్రుడి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. మరేమీ ఆలోచించ కుండా, వ్యవధి ఇవ్వకుండా అతడిని తన వీపు మీదకి లాక్కున్నాడు. సురేంద్రను వీపు మీదా మోస్తూ, యధావిధిగా పోటీని కొనసాగించాడు. వీపున బరువు ఉన్నందువల్ల అతడి వేగం క్షీణించింది.
అది అవకాశంగా తీసుకొని మూడోస్థానంలో వస్తున్న పోటీదారుడు విశ్వమూర్తి విమలుడిని దాటుకొని ముందుకు దూసుకుపోయాడు. విమలుడు ఎంత ప్రయత్నించినా విశ్వమూర్తిని అధిగమించలేక పోయాడు. మొదటగా జొన్నగిరి గట్టుకు చేరిన విశ్వమూర్తిని విజయం వరించింది. కొంతమంది ప్రజలు విమలుడిని విజేతగా ప్రకటించాలని నినాదాలు చేశారు. సాయంకాలం సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో రంగరాయుడు విజేతను ప్రకటించనున్నాడు. ఆ సభకు భారీగా జనం హాజరై విజేత ఎవరో తెలుసుకోవాలన్న ఆతురతలో ఉన్నారు. రంగరాయుడు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, 'ఎటువంటి ఆటంకం లేకుండా పోటీలు విజయవంతమైనందుకు ఆనందిస్తున్నాను. పోటీల నిబంధన ప్రకారం గమ్యాన్ని ముందుగా చేరుకున్న విశ్వమూర్తిని విజేతగా ప్రకటిస్తున్నాను' అన్నాడు రంగరాయుడు. విశ్వమూర్తి తరపు వారి చప్పట్లతో సంతోషం వ్యక్తం చేశారు విశ్వమూర్తికి లక్ష రూపా యల భారీ బహుమతి ఇవ్వబడింది. విమలుడిని అభిమానించేవారు నిరుత్సాహపడ్డారు. ఆ తర్వాత రంగరాయుడు తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, 'ఈ సభ ఇంతటితో అయిపోయిందని అనుకోకండి. ఈ పోటీలలో మరొక విజేత ఉన్నాడు. అతడే విమలుడు. ఒక వ్యక్తి నీటిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయేస్థితిలో ఉంటే, తన గెలుపు గురించి పట్టిం చుకోకుండా, పోటీదారుడిని రక్షించి మానవత్వాన్ని చాటుకున్నాడు విమలుడు. అతనిది అసాధారణ విజయం. అతడికి బహుమతిగా నా కుమార్తె ఆనంది ని ఇచ్చి వివాహం జరిపించదలుచుకున్నాను. వారిద్దరి ఆమోదం ఈ సభ మొదలు కావడానికి ముందే తెలుసుకున్నాను' అని రంగరాయుడు ప్రకటించగానే ఆ ప్రదేశమంతా హర్షధ్వానాలతో నిండిపోయింది. ఆ తరువాత అంతవరకు తెరవెనుక నున్న రంగరాయుడి కుమార్తె ఆనందిని పూలమాలతో వెలుపలికి వచ్చింది. పూలమాలతో విమలుడిని వరించింది.

– గుండ్రాతి సుబ్రమణ్యంగౌడు



వార్త ఆదివారం

## బాలగేయం

### మా ఊరు



మా ఊరు
మంచి ఊరు
ఒక్క మాటమీద
ఉన్న ఊరు
మంచి మనుషులు
ఉన్న ఊరు
ప్రతి ఇంటిముందర
చెట్లను పెంచే ఊరు
పరిసరాలను పరిశుభ్రంగా
ఉంచుకొనే మా ఊరు
తడి చెత్తను
తడి చెత్తలోన
పొడి చెత్తను
పొడి చెత్తలోన
పోస్తూ ఉంటారు
మా ఊరి వారు
గాలినీరు నేలను
కలుషితం కాకుండా
కాపాడుతూ ఉంటారు
మా ఊరివారు
మంచివారు.

**- చాడా మునిశేఖర్‌రెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు


**- ఎస్.మహిజ,** మాల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఆషాఢమాసంలో కొత్తదంపతులకు ఎడబాటు ఎందుకు కలిగిస్తారు?



**జవాబు: మహిజ!** శతాబ్దాలుగా ఈ ఆచారాన్ని పాటిస్తూ వస్తున్న వాళ్లకు కూడా దీనికి గల కారణం స్పష్టంగా తెలియదు. ఖగోళశాస్త్ర పరంగా భూమి పూర్వాషాఢ నక్షత్ర మండలం/గ్రహ మండలానికి అత్యంత సమీపంలో ఉంటుంది. పౌర్ణమి రోజున చంద్ర గ్రహం పూర్వాషాఢ నక్షత్రానికి దగ్గరగా ఉంటుంది. ఈ కారణంతోనే ఆ మాసానికి ఆషాఢమని పేరు వచ్చింది. ఈ మాసంతోనే సూర్యగ్రహం మిథునరాశి నుంచి కర్కాటకం దిశగా పయనించడం ప్రారంభిస్తుంది.

ఇక ఆచార విషయానికి వస్తే.. ఆషాఢమాసం ప్రారంభమవుతుందనగానే కొత్తగా పెళ్లయిన భార్యాభర్తలను దూర దూరంగా ఉంచుతారు. ఆషాఢ మాసంలో దంపతులిద్దరూ కలిసి వుండటం వల్ల ఒకవేళ భార్య గర్భం దాల్చితే, శిశువు జన్మించేది దరిదాపుగా గ్రీష్మకాలం(ఏప్రిల్-వేసవి)లో కాగలుగుతుంది. ఎండాకాలంలో రోహిణి కార్తెలో పిల్లలు పుట్టడం ఆరోగ్య రక్షణరీత్యా మంచిది



కాదు. వేసవి గాలుల వల్ల అంటువ్యాధులు, తద్వారా బాలారిష్టాలు ఎక్కువగా దాపురిస్తాయి. అదీకాక ఎండలలో తొలికాన్పు మరీ కష్టంగా ఉంటుంది. వైజ్ఞానిక పరంగా ఈ ఆచారం వెనుక ఈ అంశాలు ఉండవచ్చని భావించాల్సి వస్తోంది.



# ఔషధ మొక్కలు

**కూర్చుంటే వెన్నునొప్పి, నడిస్తే కాళ్లనొప్పులు..ఇక, కాసేపు మౌస్‌తో కీబోర్డు మీద పనిచేస్తే మెడనొప్పి, భుజంనొప్పి..ఇలా రకరకాల సమస్యలు... వృద్ధులతోపాటు యువతనీ వేధిస్తున్నాయి.**

వెంటాడే ఈ బాధలకు తోడు కాస్త వయసు పైబడితే చాలు.. మోకాళ్ల చిప్పలు అరిగిపోవడంతో ఆస్టియో ఆర్థ్రయిటిస్, రోగనిరోధక శక్తి ఎదురుతిరగడంతో తలెత్తే రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, ఎముకలు బోలుగా మారడంతో ఆస్టియోపొరోసిస్.. వంటివన్నీ పిలవకుండానే వచ్చిపడుతున్నాయి.

మందులు వాడినా శస్త్రచికిత్స చేయించుకున్నా ఫలితం కొంతవరకే. అందుకే ఆయా చికిత్సలతోపాటు కొన్ని రకాల ఔషధ మొక్కలతోనూ ఎముక ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు అంటున్నారు సంప్రదాయవైద్యులు.

## బొరేజ్ ఆరోగ్యానికి మంచిది

వంగరంగులో నక్షత్ర ఆకారపు పూలతో ఉండే ఈ ఔషధమొక్క ఐరోపా దేశాల్లో పెరుగుతుంది. ఆకుల్ని తాజాగానూ ఎండు రూపంలోనూ సూప్‌లూ సలాడ్లూ జెల్లీలూ పాస్తా..వంటి వంటల్లో వాడతారు. ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉన్న ఈ గింజల నుంచి తీసిన నూనె కీళ్లనొప్పులకు మంచి ఆయింట్‌మెంట్‌లా పనిచేస్తుందట. ఈ నూనె, జెల్ క్యాప్సూల్స్ రూపంలో మింగేందుకు వీలుగా దొరుకుతుంది. ఇందులో గామా లినోలెనిక్ (జీఎల్‌ఏ), లినోలెనిక్ (ఎల్‌ఏ) అనే పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఒమెగా-6 అనే ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. జీఎల్‌ఏ కీళ్ల దగ్గరుండే కణ నిర్మాణానికీ పనితీరుకీ ఎంతో ఉపయుక్తం. ఇది శరీరంలోకి వెళ్లాక రోగనిరోధకశక్తిని ప్రభావితం చేసి కీళ్ల దగ్గర మంటని కలిగించే హార్మోన్లను అడ్డుకుంటుంది. సాధారణంగా సన్‌ఫ్లవర్ వంటి నూనెల్లో ఉండే లినోలెనిక్ ఆమ్లం శరీరంలోకి వెళ్లాక జీఎల్‌ఏగా మారుతుంది. కానీ వృద్ధాప్యం, పోషకాహారలోపం, వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంగా శరీరం దాన్ని ఉత్పత్తి చేయలేదు. బొరేజ్ గింజల్లో ఇది పుష్కలం. అందుకే కీళ్లవాతంతో బాధపడేవాళ్లకి ఆరునెలల పాటు 2.8గ్రా. చొప్పున ఈ క్యాప్సూల్‌ను ఇవ్వగా ఫలితం కనిపించిందట.

**అశ్వగంధ:** భారతీయ జిన్‌సెంగ్‌గా పిలిచే అశ్వగంధ వేళ్లను సంప్రదాయ వైద్యం ఎముక వ్యాధుల చికిత్సలో వేల ఏళ్లనుంచీ ఉపయోగిస్తోంది. దీని వేళ్లు గుర్రం వాసనని తలపిస్తాయి. అందుకే ఈ మొక్కకు ఆ పేరు వచ్చిందట. ఈ సప్లిమెంట్లను పన్నెండు వారాలపాటు తీసుకోవడం వల్ల ఆస్టియో ఆర్థ్రయిటిస్‌తో బాధపడుతున్నవాళ్లకు వాపులూ నొప్పులూ తగ్గాయని 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్' అన్న పత్రిక ప్రచురించింది. రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ కారణంగా వచ్చే నొప్పినీ వాపునీ తగ్గించే గుణాలు కూడా ఉన్నట్లు పరిశీలనల్లోనూ వెల్లడైందని అరిజోనా నిపుణులూ చెబుతున్నారు. ఎముకల్లో కాల్షియం శోషన పెరిగేలా చేసి, కీళ్లదగ్గర మృదులాస్థి కణాల ఉత్పత్తిని పెంచుతుందనీ, దాంతో అరిగిన కీళ్లు మెరుగవుతాయనీ మరింత దెబ్బతినకుండా ఉంటాయనీ అధ్యయనాల్లోనూ తేలింది. కాబట్టి ఈ పొడిని గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని పరగడుపున తాగితే, కీళ్ల అరుగుదల నెమ్మదిస్తుందట.



**తిప్పతీగ:** హృదయాకారపు ఆకులతో పసుపు పువ్వులతో ఎర్రని పండ్లతో ఉండే తిప్పతీగను ఇప్పటికే మధుమేహ నియంత్రణకోసం వాడుతున్నారు. దీన్నే గిలోయ్ అనీ అంటారు. అంటే వృద్ధాప్యాన్ని నిరోధించే అమృతం అని అర్థమట. ఈ మొక్క కాండంలోని ఫైటోకెమికల్స్ ఇన్‌ఫ్లమేషన్‌ను అడ్డుకుంటాయనీ తద్వారా కీళ్లవాపుల్ని నివారిస్తాయనీ తేలింది.



ఎముక కణాల సంఖ్యను పెంచడం ద్వారా వాటి పటుత్వాన్ని పెంచగలదని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. గోరువెచ్చని పాలల్లో పావు లేదా అరటీస్పూను తిప్పతీగ పొడి వేసుకుని తాగితే కీళ్లనొప్పులు తగ్గుతాయి అంటారు సంప్రదాయ నిపుణులు. ఈ తీగ కాండం, కాస్త పసుపు, బెల్లం, అల్లం, తులసి ఆకులు అన్నీ కలిపి తీసిన రసాన్ని భోజనానికి ముందు టీస్పూను చొప్పున తాగితే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఇప్పుడు తిప్పతీగ ట్యాబ్లెట్లు, సిరప్‌ల రూపంలో నేరుగానూ దొరుకుతోంది.

**నల్లేరు:** కొన్ని మొక్కల్ని చూస్తే ఎంతో



ఆశ్చర్యంగా ఉంటుంది. ఆకులో కాయలో లేదా పండ్లు అచ్చం మానవ శరీరంలోని భాగాల్ని పోలి ఉండటమే కాదు. వాటి ఆరోగ్యానికీ తోడ్పడుతుంటాయి. ఆ కోవకే చెందుతుంది నల్లేరు. వెన్నముకని తలపిస్తూ కణువులతో ఉండే ఈ మొక్క అసాంతం గొప్ప ఔషధం. ఇది తింటే ఎముకలు ఎంతో దృఢంగా ఉంటాయన్న కారణంతోనే దీన్ని వజ్రవల్లి, అస్థిసంధాన అని పిలుస్తారు. వేల సంవత్సరాల నుంచీ సంప్రదాయ వైద్యంలో మోకాళ్ల నొప్పులూ, కీళ్లవాపుల నివారణకు వాడుతున్నారు. అరిగిన ఎముకల్ని అతుక్కునేలా చేస్తుందనీ, ఆ ఎముకలకు అతుక్కుని ఉండే కండరాలకు శక్తినిస్తుం దనీ భావప్రకాశిక గ్రంథం పేర్కొంటోం ది. ఎన్నో రకాల ఔషధ గుణాలున్న ఈ కాడల రసాన్ని సిద్ధవైద్యంలోనూ వాడతారు. ఇందులోని బీటా-సైటోస్టెరాల్, ల్యూటియోలిన్ వంటి ఫ్లేవనాయిడ్లు వాపుల్నీ నొప్పుల్నీ తగ్గించడంతో పాటు ఎముక కణాలు త్వరగా ఉత్పత్తయ్యేలా చేస్తాయి. ఈ విషయమై జంతువుల్లో క్షుణ్ణంగా పరిశీలించగా నిపుణులు సైతం కొత్త కణాల ఉత్పత్తని చూసి ఆశ్చర్య చకితులయ్యారట. నల్లేరు గుజ్జును ఎముకలు విరిగిన చోట రాసి దానిమీద దూదికట్టు వేస్తే త్వరగా అతుక్కుంటా యనీ చెబుతారు. ఈ మొక్క వేళ్లపొడిని కూడా ఎముక పగుళ్ల నివారణకు వాడతారట. నల్లేరులో పోషకాలతోపాటు కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. మహిళలు మెనోపాజ్ సమయంలో దీన్ని తింటే ఎముకలు గుల్లబారకుండా ఉంటాయి. ఒకప్పుడు పొలంగట్లమీదా డొంకల్లోనూ పెరిగే నల్లేరుని పల్లెవాసులు ఎక్కువగానే తినేవారు.

## ఆహారంలో

ఔషధాలుగా మాత్రమే కాదు. ఆహారంలో భాగంగా మనం తినే ఎన్నో పదార్థాలు సైతం ఎముకలూ, కీళ్ల నొప్పులకు మందులా పనిచేస్తాయి. శతాబ్దాలుగా వాడుతోన్న అల్లం రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ వల్ల తలెత్తే ఇన్‌ఫ్లమేషన్‌కీ, నొప్పికీ కారణమైన హార్మోన్లను అడ్డుకుంటుందన్నది మరో పరిశీలన. కాబట్టి నొప్పి ఉన్నవాళ్లు కాస్త శొంఠి పొడిని నీళ్లలో కలుపుకుని 12 వారాల పాటు తాగితే ఫలితం ఉంటుంది. అలాగే అనాల్జెసిక్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉండే పసుపునీ, వెల్లుల్లినీ ట్యాబ్లెట్ల రూపంలో ఇచ్చినప్పుడు కీళ్లవాతం తగ్గిందట. రోజుకు రెండుసార్లు 500 మి.గ్రా తీసుకోమని సూచిస్తుంది ఆర్థ్రయిటిస్ ఫౌండేషన్. అలాగే వీలైనంత ఎక్కువగా వంటల్లో వాడినా మంచిదే. పసుపును నల్లమిరియాలతో కలిపి వాడితే శరీరం ఎక్కువగా గ్రహిస్తుందనీ చెబుతారు. ఒకరకం తుమ్మ చెట్ల నుంచి తీసే జిగురు



(గోంద్)సైతం మృదులాస్థి కణజాలం దెబ్బతినకుండా చేస్తుంది. చలికాలంలో కీళ్లనొప్పులు మరీ ఎక్కువగా ఉంటాయన్న కారణంతోనే ఉత్తరాదిన ఈ కాలంలో చిగురుతో చేసిన గోంద్ లడ్డూలు తప్పనిసరిగా తింటుంటారు. ఇక, మనం రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకునే మిరియాలు, మిర్చి..వంటివాటికీ మంటని తగ్గించే గుణాలు ఉన్నాయి. కాల్షియం, ఐరన్,సి-విటమిన్ సమృద్ధిగా ఉండే మునగ ఆకులు, మునక్కాడలు..కూడా ఎముక బలాన్ని పెంచి ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే పాలు, బాదం, సోయా, టోఫు, నట్స్, చేపలు, ఆకుకూరలు సైతం ఎముకల వృద్ధికి తోడ్పడతాయి.

## థైమ్



పుదీనా కుటుంబానికి చెందిన ఓ సుగంధమొక్క మధ్యధరా ప్రాంత వంటకాల్లో దీని వాడకం ఎక్కువ. శ్వాససంబంధ, అల్సర్ సమస్యలతో పాటు నోటి దుర్వాసనకీ వాడుతుంటారు. రోమన్లు ఎండిన థైమ్ ఆకులతో ధూపం వేసేవారట. దీని నూనెలోని థైమోల్, బోర్నాయోల్..వంటి పదార్థాలు క్రిమినాశక గుణాల్ని కలిగి ఉంటాయి. అందుకే ఈ నూనెను బ్యాండేజ్‌లకీ మౌత్‌వాష్‌గానూ వాడేవారు. అయితే నాలుగేళ్ల క్రితం చేసిన ఓ అధ్యయనంలో ఇందులోని యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ కారణంగా వచ్చిన నొప్పినీ తగ్గించినట్లు గుర్తించారు. 'కాంప్లిమెంటరీ థెరపీస్ ఇన్ మెడిసిన్ సైతం రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌కు ఇది మంచి మందు అని పేర్కొంది. కాబట్టి దీన్ని టీ లేదా ఆహారపదార్థాల్లో చల్లుకోవడం ద్వారా రోజూ తీసుకున్నా మేలే.

కథ

గన్నవరపు నరసింహమూర్తి

# అంతర్యామి



**మేం అలిపిరి చేరేసరికి ఉదయం ఆరు గంటలైంది. కానీ రాత్రి తిరుమల కొండల్లో కురిసిన కుండపోత వర్షానికి కొండల మీద నుంచి పెద్ద పెద్ద బండరాళ్లు రెండు ఘాట్ రోడ్ల మీద అడ్డంగా పడిపోవడంతో ఆ మార్గాలు మూసుకుపోయాయి.**

ఆ రాళ్లను తొలగించడానికి ఆరు గంటల సమయం పడుతుందనీ, ఆ తరువాతే వాహనాలను తిరుమల కొండ మీదకు అనుమతిస్తామనీ టిటీడీ అధికారులు ప్రకటించడంతో నాకేం చెయ్యాలో తోచలేదు.

నేను విజయనగరంలోని ప్రభుత్వ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నాను. నా భార్య సుప్రజ అక్కడి స్కూల్లోనే ఉపాధ్యాయురాలు. మా అబ్బాయి శ్రీకర్‌కి ఐఐటీలో సీటు వస్తే తిరుమలకి వచ్చి ఏడుకొండల స్వామిని దర్శించుకొని, హుండీలో రెండు లక్షల రూపాయల ముడుపు వేస్తాననీ సుప్రజ మొక్కుకుంది.

అనుకున్నట్లుగానే శ్రీకర్‌కి మంచి ర్యాంక్ వచ్చి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు వచ్చింది. అప్పట్నుంచీ మొక్కు తీర్చుకోవాలనీ సుప్రజ నన్ను చెవిలో ఇల్లు కట్టుకొనీ పోరు పెడుతున్నా నేను సెలవుల సమస్య వల్ల తిరుపతి ప్రయాణం వాయిదా వేస్తూ వచ్చాను. కానీ దసరా సెలవులు రావడంతో ఇప్పుడు వచ్చాం.

ఆరు గంటలు అక్కడ ఉండటం కష్టం కాబట్టి హోటలుకి వెళ్లిపోయి మర్నాడు వద్దామని సుప్రజతో చెప్పాను. కానీ సుప్రజకెందుకో నా మాటలు నచ్చలేదు. ఒక్కసారి దర్శనానికి వచ్చినవాళ్లు తిరిగి వెనక్కి వెళ్లకూడదని చెప్పింది.

ఇంతలో కొంతమంది మెట్ల దారి గుండా కొండ మీదకు వెళుతుండటంతో సుప్రజ ఆ మెట్ల దారి దగ్గరకు వెళ్లింది. అప్పటికే చాలామంది మెట్లగుండా కొండ మీదకు వెళుతూ కనిపించారు.

సుప్రజ వెంటనే నా దగ్గరికి వచ్చి "ఏమండీ! మనం కూడా మెట్లెక్కి కొండ మీదకు వెళదాం. తొమ్మిది కిలోమీటర్ల దూరమేనట. 3550 మెట్లు పరవాలేదు 5 గంటల్లో వెళ్లిపోవచ్చు.. పదండి బయలుదేరుదాం" అని చెప్పింది.

"సుప్రజా! నీకేం పిచ్చా? నీకసలే ఆయాసం. ఈ వయసులో మెట్లు ఎక్కడం.. అందునా 3550 మెట్లు ఎక్కడం చాలా కష్టం. మనం మనిష్ట ప్రకారం వెనక్కి వెళ్లటం లేదు. అంతా ప్రకృతి మహిమ. అది భగవంతుడికి తెలుసు. కాబట్టి వెనక్కి వెళ్లడం తప్పేం కాదు. చాలామంది వెనక్కి వెళ్లిపోతున్నారు. కనుక పద.. రాళ్లు తొలగించగానే వద్దాం" అని చెప్పాను.

కానీ సుప్రజ వినలేదు. ఇక తప్పక మెట్లదారి వెంట వెళ్లడానికి నిర్ణయించుకున్నాం. వెంటనే డ్రైవర్ని తిరుపతి పంపించేసి రాళ్లను తొలగించిన తరువాత వాడిని కొండ మీదకు రమ్మనమని చెప్పి మేం మెట్లదారి దగ్గరికి చేరుకున్నాం.

"మొదట్లో బస్సులుండేవి కావట, భక్తులందరూ ఈ మెట్ల గుండానే వెళ్లి స్వామిని దర్శించుకునేవాళ్లట" అంది సుప్రజ.

"తప్పదు అనుకుంటే మనిషి ఎంత కష్టమైనా పడతాడు. ఒకసారి సుఖానికి అలవాటు పడితే కష్టపడటానికి చచ్చినా ఇష్టపడడు. మా ఊరికి నా చిన్నప్పుడు బస్సు ఉండేది కాదు. అప్పుడు 15 కిలోమీటర్లు నడిచి వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు బస్సులు వచ్చిన తరువాత నడిచి వెళ్లగలమా? చెప్పు" అన్నాను సుప్రజతో.

"శ్రీవారి మెట్ల దారిలో వెళితే మెట్లు తక్కువట. నిజమేనా?" అని అడిగింది సుప్రజ.

"అలిపిరి నుంచి తిరుమలకు మెట్ల ద్వారా కాలిబాట, రెండు ఘాట్ రోడ్లు మొదలవుతాయి. పూర్వం అలిపిరిని అడి పుళీ అని పిలిచేవారట. అడి అంటే పాదం, పుళి అంటే చింతచెట్టు. ఇక్కడ పెద్ద చింతచెట్టు ఉండేదట. అందుకే దీన్ని అలిపిరి అని పిలుస్తున్నారు. రామానుజుని కాలం నుండి ఈ కాలిబాట ఉందట. ఇక రెండవ మార్గం చంద్రగిరి నుండి మొదలవుతుంది. అది 2 కిలోమీటర్లే. 2800 మెట్లు. కానీ నిలువుగా ఉండడం వల్ల ఎక్కటం కష్టం అవుతుంది. మొదటి ఘాట్ రోడ్డుని 1945లో వేస్తే, రెండవదాన్ని 1974లో వేసారు. ఇంకొందరు అలిపిరి అంటే అలసట తీర్చుకునే ప్రాంతం అని కూడా అంటారు" అని ఆ మెట్ల మార్గం

గురించి నాకు తెలిసిన విషయాలు సుప్రజకి చెప్పాను. ప్రభాత సమయం కావడంతో జనాలు పలచగా ఉన్నారు. చాలామంది మొదటి మెట్టు దగ్గర కొబ్బరికాయలు కొట్టి మెట్లెక్కడం మొదలు పెడుతున్నారు.

సుప్రజ ఆ మొదటి మెట్టుకి దండం పెట్టి మెట్లెక్కడం మొదలు పెట్టింది. నేను వెనకాలే ఆమెను అనుసరించాను.

చుట్టూరా పచ్చటి ప్రకృతి.. ఎత్తైన కొండలు.. భక్తులందరూ 'గోవిందా' 'గోవిందా' అని పిలుస్తుంటే అది ఆ కొండల్లో ప్రతిధ్వనించసాగింది.

కొద్ది దూరం వెళ్లగానే పెద్ద గోపురం కనిపించింది. ఇలాంటి రాజగోపురాలు ఏడు కొండలకూ ఏడు ఉన్నట్లు ఎవరో భక్తుడు పక్కవాళ్లతో చెబుతున్నాడు. మరికొద్ది దూరంలో దశావతారాల్లో మొదటి అవతారం మత్స్యావతారం విగ్రహం కనిపించింది. ఆ పక్కనే భక్తులందరి లగేజ్‌ని చెక్ చేస్తున్నారు.

అది మొదటి చెక్ పాయింట్. మెట్లు నిలువుగా ఉండటంతో సుప్రజ అలసిపోసాగింది. మొత్తం 3550 మెట్లలో 2000 మెట్లు నిలువుగా ఉంటాయనీ చెక్ గేట్ ఉద్యోగి చెప్పాడు. అయితే మొత్తం మెట్లన్నీ రేకులతో కప్పడం వల్ల చల్లగా హాయిగా ఉంది.

ఇంతలో ఒక ఏభై ఏళ్ల వ్యక్తి ఆయాసంతో ఒక మండపం దగ్గర కూర్చుండిపోయాడు. ఆ పక్కనే కూర్మావతార విగ్రహం పెద్దగా కనిపిస్తోంది. ఆ వ్యక్తికి అతని భార్య కాబోలు.. నీళ్లు తాగించడంతో కొద్దిగా ఆయాసం తగ్గి కళ్లు తెరిచాడు.

నేను ఆవిడతో "ఏమ్మా! ఇతనికి ఆయాసం ఉన్నట్లుంది. ఇతను 3500 మెట్లు ఎక్కడం కష్టం. దయచేసి వెనక్కి వెళ్లిపోయి ఏ బస్సులోనో రండి" అని అన్నాను.

నా మాటలకు ఆమె నా వైపు తిరిగి "పిల్ల పెళ్లి కుదిరితే కొండ మీదకు మెట్లెక్కి వస్తామని ఆ ఏడుకొండల వాడికి మొక్కుకున్నాం. అదృష్టవశాత్తూ నెల రోజుల క్రితం దానికి పెళ్లి కుదిరింది. దండం పెట్టుకున్న తరువాత మొక్కు తీర్చకపోతే ఆ స్వామికి కోపం రాదా చెప్పండి! అసలే వడ్డికాసులవాడు" అంది ఆమె.

ఆమె మాటలకు నేను, సుప్రజ ఆశ్చర్యపోయాం. ఆమె చామనచాయ రంగులో సన్నగా ఉంది. "అమ్మా! ఏ ఊరు నుంచి వస్తున్నారు? మీ ఇద్దరే వచ్చారా? మీ పిల్లలెవరైనా వచ్చారా?" అని అడిగాను ఆమెని.

"బాబూ! నా పేరు సుశీల. మేం విశాఖపట్నం నుంచి వస్తున్నాం. మా వారు పౌరోహిత్యం చేస్తుంటారు. మాతో పాటు మా అబ్బాయి శర్మ వచ్చాడు" అంటూ వెనకాల ఉన్న పాతికేళ్ల యువకుడిని చూపించింది.

"మరిప్పుడేం చేస్తారు?" అని అతన్ని అడిగాను.
"అదే అర్థం కావటం లేదు.. ఏ అప్పో చెయ్యాలి. అయినా రెండు లక్షలు ఎవరిస్తారు చెప్పండి?" అన్నాడు నిర్వేదంగా.

అతను చెవులకు కుండలాలు, నుదుటన బొట్టు, పంచెకట్టులో దృఢంగా ఉన్నాడు.

ఇంతలో ఆమె భర్తకు ఆయాసం తగ్గడంతో మళ్లీ నడవడం మొదలు పెట్టారు. మరికొన్ని మెట్లు ఎక్కగానే రెండవ రాజగోపురం కనిపించింది. దాని పేరు మైసూరు గోపురం అని దాని మీద రాసి వుంది. అప్పటికి వెయ్యి మెట్లు ఎక్కాం.

వంద మెట్ల తరువాత ఇంకా ఎన్ని మెట్లు ఎక్కాలో వాటి వివరాలు బోర్డుల మీద టీటీడీవాళ్లు రాశారు.

నేను ఆ పురోహితుడి వెనకాలే నడుస్తూ అతని ఆరోగ్యాన్ని గమనించసాగేను. ఇంతలో వరాహావతారం విగ్రహం కనిపించింది. దాని పక్కన ఆ అవతారం గురించి, ఆ ప్రదేశం గురించి రాయబడింది. ఆ తరువాత మరొక వంద మెట్ల తరువాత మూడవ గాలిగోపురం వచ్చింది. అక్కడికి 2000 మెట్లు ఎక్కాం. ఇంకా 1550 మెట్లు మెట్లెక్కాలి. ఇక్కడ నుంచి వాలు తక్కువగా ఉంటుందని ఒక వ్యక్తి చెప్పాడు. ఆ పక్కన ఉన్న కౌంటర్లో దర్శనం టికెట్లని స్కాన్ చేయించి అక్కడ కూర్చున్నాం. ఆ పురోహితుడికి మళ్లీ ఆయాసం పెరిగింది.

"అయ్యా! తమరు కొద్దిగా విశ్రాంతి తీసుకోండి" అంటూ అతనికి తాగేందుకు నీళ్లిచ్చాను.

అతను నీళ్లు తాగి "నా పేరు కృష్ణమూర్తి. ఈ మెట్లు ఎక్కడం కష్టం అనీ నాకు తెలుసు. మొక్కు కాబట్టి తప్పనిసరిగా బయలుదేరాను. అన్నిటికీ ఆ ఏడుకొండలవాడే ఉన్నాడు" అని చెప్పాడు, కృష్ణమూర్తి.

"అమ్మాయి పెళ్లి కుదిరితే మెట్లెక్కి వస్తానని ఎందుకు మొక్కుకున్నారు? ఏదయినా సమస్యా?" అని అతన్ని అడిగాను.

"నేనా పేద పురోహితుడిని. పిల్ల పదవ తరగతి వరకే చదువుకుంది. పురోహితుడి కూతురనీ, ఇంజినీరంగు చదవలేదనీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చెయ్యటం లేదనీ... ఇలా ఏవో కారణాలు చెప్పి ఎవ్వరూ పెళ్లి చేసుకునేందుకు ముందుకు రావటం లేదు. కొందరైతే బోలెడు కట్నం అడుగుతున్నారు. అంత కట్నం ఇచ్చే స్థోమత నాకు లేదు.

మొన్న మా అదృష్టంకొద్దీ ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి తాలూకా ఆఫీసులో అటెండర్‌గా పని చేస్తున్నాడు. అతను మా పిల్ల సావిత్రిని నచ్చి పెళ్లికి ఒప్పుకున్నాడు. కాకపోతే వాళ్ల చెల్లి పెళ్లి కోసం రెండు లక్షలు అప్పు చేసాడట. ఆ డబ్బు మాత్రం మమ్మల్ని ఇమ్మంటున్నాడు. పెళ్లి ఎలా చేసినా పరవాలేదట. సంబంధం మాకు నచ్చింది. కానీ అతనడిగిన రెండు లక్షలు ఇవ్వటానికి నా దగ్గర లేవు" అని చెప్పి మళ్లీ నడవటం మొదలు పెట్టాడు.

"మరిప్పుడేం చేస్తారు?" అనీ అతన్ని అడిగాను.

"అదే అర్థం కావటం లేదు.. ఏ అప్పో చెయ్యాలి. అయినా రెండు లక్షలు ఎవరిస్తారు చెప్పండి?" అన్నాడు నిర్వేదంగా.

ఆ తరువాత అతనికి ఆయాసం మొదలవడంతో నేను మౌనం దాల్చేను. నా వెనక సుప్రజ, సుశీలగారు, వాళ్లబ్బాయి నిటారుగా వున్న మెట్లెక్కుతున్నారు. ఇంతలో మెట్ల పక్కన పెద్ద ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం కనిపించింది. కృష్ణమూర్తిగారు పక్కనే ఉన్న మండపంలో కూర్చుని ఆయాసం తీర్చుకోసాగాడు. ఆ పక్కనే 2630 మెట్లు ఎక్కినట్లు వివరాలు రాసి ఉన్నాయి. ఇంకా సుమారు 900 మెట్లెక్కాలి.

కృష్ణమూర్తిగారి ఆయాసం చూస్తుంటే అతను వాటిని ఎలా అధిరోహిస్తాడా అని నేను ఆలోచించసాగేను. ఆ పక్కనే అటవీ మ్యూజియం ఉంది.

కొద్ది దూరంలో దొరసాని మండపం, ఆ పక్కనే కొన్ని జింకలు, చుట్టూరా పనసచెట్లు, వాటికి ఎన్నో పనసకాయలు వేలాడుతూ కనిపిస్తున్నాయి.

కొద్దిసేపటి తరువాత మేం మళ్లీ మెట్లెక్కడం మొదలు పెట్టాం. ఇంతలో మేం తిరుమల ఘాట్ రోడ్డుకి చేరుకున్నాం. ఆ తరువాత ఒక కిలోమీటరు దాని పక్కనే నడిచి, మళ్లీ మెట్లెక్కడం మొదలు పెట్టాం.



ఆ తరువాత మోకాలి పర్వతం మొదలైంది. అక్కడ చాలా మంది మోకాళ్ల మీద మెట్లను ఎక్కుతూ కనిపించారు. కొద్ది దూరం తరువాత ఆఖరి మెట్టు వచ్చింది. అక్కడ మళ్లీ చాలామంది కొబ్బరికాయలు కొడుతూ కనిపించారు. మేం, కృష్ణమూర్తిగారి కుటుంబం కూడా కొబ్బరికాయలు కొట్టాం. అక్కడ కృష్ణమూర్తి కాలి నడకన గుడికి వస్తామన్న మొక్కు తీరినందుకు ఆనందంతో దండం పెట్టాడు.

ఆ తరువాత తిరుమల మొదలైంది.

నేను అతన్ని చూస్తూ ఆలోచించసాగేను. మేం ఇప్పుడు స్వామిని దర్శనం చేసుకొని హుండీలో రెండు లక్షలు వెయ్యాలి. మేం రెండు లక్షలు అందులో వేస్తే ఏడు కొండల స్వామికి పెద్ద తేడా ఉండదు. కానీ పేద పురోహితుడైన కృష్ణమూర్తికి ఆ రెండు లక్షలిస్తే అతని కూతురు వివాహం అవుతుంది.

వెంటనే నా ఆలోచనని సుప్రజకి చెప్పాను.

ఆమె ఆశ్చర్యపోతూ "మరి నా మొక్కెలా తీరుతుంది? స్వామి కోప్పడడా?" అని అడిగింది.

"లేదు సుప్రజా! స్వామి కోప్పడడు సరికదా అనందిస్తాడు. నా ఉద్దేశంలో.. ఈ కృష్ణమూర్తికి సహాయం చెయ్యాలనే ఉద్దేశంతోనే మనల్ని మెట్ల మార్గం గుండా వచ్చేలా చేసాడేమోననీ అనిపిస్తోంది. ఇది నా ఆలోచన కాదు. స్వామి మనోభీష్టం. ఇంకేం ఆలోచించొద్దు. ఈ డబ్బు మనం హుండీలో వేద్దామనుకోగానే స్వామిదైపోయింది. అతని డబ్బునే మనం తన పేద భక్తుడికి ఇస్తున్నాం. భక్తులను ఆదుకోవడమే కదా ఆ స్వామి అభీష్టం" అని నా బ్యాగులో ఉన్న నాలుగు ఐదు వందల రూపాయల కట్టలు మొత్తం రెండు లక్షల రూపాయలు అతనికివ్వబోయాను.

వెంటనే కృష్ణమూర్తి ఆశ్చర్యపోతూ "మీరు స్వామికి ముడుపుగా హుండీలో వెయ్యాలని మొక్కుకున్నారు. మొక్కుకున్న డబ్బు స్వామికి చెందుతుంది. కాబట్టి మీరు హుండీలో వెయ్యండి. లేకపోతే వడ్డికాసులవాడు వడ్డీతో సహా వసూలు చేస్తాడు" అని చెప్పాడు.

'అయ్యా! స్వామి డబ్బుని ఏం చేసుకుంటాడు చెప్పండి? దాని అవసరం ఉన్న భక్తులకు ఇస్తాడు. ప్రస్తుతం మీ పిల్ల పెళ్లికి డబ్బు అవసరం. అందుకే కాబోలు ఈ డబ్బుని మీకివ్వాలన్న ఆలోచన ఆ స్వామి నాకు కలిగించినట్లున్నాడు. రాత్రి పెద్ద వర్షం.. దానివల్ల బండరాళ్లు పడి రోడ్డు మూసుకుపోయి వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడం, మొక్కుకోకపోయినా ఈ మెట్ల దారి గుండా మేం రావడం, ఇక్కడ మీరు కలవడం.. ఇవన్నీ చూస్తుంటే మీకు సహాయం చెయ్యాలని ఆ స్వామే ఇదంతా చేసినట్లున్నాడు. ఈ ప్రయాణ అంతరార్థం అదే. తన డబ్బుని నా చేత ఆ స్వామే ఇప్పిస్తున్నాడు. ఇది నా డబ్బు కాదు. ఒకసారి మొక్కుకున్న తరువాత ఇది స్వామిదే. కాబట్టి స్వామి డబ్బుని వద్దనే హక్కు మీకు లేదు. అది అపరాధం, స్వామికి కోపం కలుగుతుంది. కాబట్టి మీరు కాదనకుండా తీసుకోవాలి" అంటూ ఆ డబ్బుని అతనికిచ్చి నేను, సుప్రజ గుడికి వెళ్లి స్వామిని దర్శించుకున్నాం.

స్వామిని దర్శించుకున్నప్పుడు స్వామి ముఖంలో చిరునవ్వు కనిపించినట్లు అనిపించింది. అదే విషయాన్ని సుప్రజతో చెబితే ఆమెకి కూడా అలాగే అనిపించిందని చెప్పడంతో నాకాశ్చర్యం కలిగింది.






## నాలుగు సార్లు చేయండి..

డాక్టర్: ఆపరేషన్ చేస్తే ఇరవై ఐదు శాతం బతకడానికి ఛాన్స్ ఉంది.

రోగిబంధువు: అలా అయితే ఆపరేషన్ నాలుగు సార్లు చేయండి డాక్టర్.

## అందరిలో ఉంటే..

గురూజీ: వెయ్యి మంది స్త్రీల మధ్యలో తన భార్యని మాత్రమే వెతుకుతాడు భర్త.

శిష్యుడు: అదెలా గురూజీ? భార్యంటే అంత ప్రేమనా?

గురూజీ: తన భార్య అందులో వుంటే ఇంకెవ్వరినీ చూడలేడుగా!

## పడిపోయింది

రాధ: నివాస్, నీకు రెండు రూపాయల కాయిన్ ఇస్తున్నా. ఒకటి చాక్లెట్‌కి, రెండోది దేవుడి హుండీలో వేయి.

నివాస్: అలాగే మమ్మీ!

రాధ: నేను చెప్పినట్లు చేసావా?

నివాస్: మమ్మీ ఒక రూపాయి పడిపోయింది. అది హుండీలో వేయాలి. ఇంకో రూపాయితో చాక్లెట్ కొనుక్కున్నా.

## మా ఆవిడ చీరలున్నాయిగా!

మదన్: రిమీ, కట్టుకున్న చీరతో వచ్చేయి, నిన్ను జాగ్రత్తగా చూసుకుంటాను.

రిమి: అమ్మో, కట్టుకోవడానికి ఇంకో చీర లేకుంటే ఎలా?

మదన్: ఏం పర్వాలేదు. మా ఆవిడ చీరలు ఉన్నాయి.

## అబద్ధం చెబుతోంది

నాని: కృష్ణా, మీ ఆవిడ నిన్ను మోసం చేస్తోందని ఎలా చెప్పగలవు?

మదన్: తను నిన్న రజనితో సినిమాకి వెళ్లానని చెప్పింది. కానీ నిన్న రజని నాతో ఉంది.

## నాకు తెలుసుగా!

డాక్టర్: మీ ఆవిడ తల సిటీ స్కాన్ చేసాం. అందులో ఏమీ లేదు. సరేనా?

అనిల్: మా ఆవిడ తలలో ఏమీ లేదని నాకు తెలుసు. ఆ విషయం చెప్పటానికి మీరు పది వేలు ఫీజు తీసుకున్నారు.

**- ఈ.ఎస్.మాధవన్**

# జాషువా సాహిత్య వైశిష్ట్యం

డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు

**సమాజాన్ని నడిపించే నైతిక ప్రబోధంతో కూడుకున్నదే సాహిత్యం. హితేన సహితం సాహిత్యం. హితంతో కూడకపోతే అది సాహిత్యం కాదన్న మాట.**

**ఆ నేపథ్యంలో జాషువా చెప్పిన పద్యాలన్నీ హిత ప్రబోధంతో ఉన్నవేనా?**

సమాజం పెడతోవలో పోతే, దానికి సక్రమ మార్గం చూపించటమే హితబోధ. కవిత్వానికి ఇది ఊపిరి. దీపం లేని ఇల్లు నీతి లేని కథ లాంటిది. కనుక ఏ కవి ఏది రాసినా అందులో పాఠకునికి అందవలసిన నైతిక విలువలు ఉండాలి. కవిత్వం రాయటం ఒక ఫేషన్(ఫషిఒన్) అనుకుంటే పొరపాటు. ఒక పాషన్(పస్సి ఒన్) బాధ్యత అని హెచ్చరించినవాడు జాషువా. అచ్చమైన ఆధునిక కవికి ఈ సందేశం చైతన్యం అందించటమే ధ్యేయం. అందులో జాషువా సిద్ధహస్తుడు.

మామూలుగా అయితే కవికి మరో ధ్యేయం కూడా ఉంది.

అదే ఆనందం కలిగించటం.. ఆహ్లాదం అందించటం.

ఇది ఒకానొకప్పటికి పరిమితం కావొచ్చు.

కానీ
అప్పుడైనా, ఇప్పుడైనా
సందేశం అనేది ఉండాలి.
అప్పుడైనా
అందంగా చెప్పటమనేది సాగాలి.
జాషువా కవిత్వంలో
అటు నైతిక ప్రబోధం
ఇటు కవితా సౌందర్యం
రెండూ చోటు చేసుకొని ఉండటం పాఠకులు గమనించారు.

నైతిక ప్రబోధం అవసరమా?

మతం సామాన్యునికి అర్థం కాలేదు. మూఢమైన ఆచారాలు చోటు చేసుకున్నాయి. మతం కుదురుతో కలగలిసిన కుల తత్త్వం మరిన్ని అనాచారాలకు అంటరానితనం వంటి అసాంఘిక ఆచారాలకు పుట్టినిల్లయింది. సంఘంలో తాగుడు, వ్యభిచారం వంటి దురాచారాలు పెట్రేగిపోతున్నాయి. వీటన్నిటిని ఖండించి ప్రజల్ని వీటికి దూరంగా ఉంచాల్సిన నైతిక బాధ్యత కవికి ఏర్పడింది. వీటిపై తిరుగుబాటు భావం జాషువాకు కలిగింది.

'గబ్బిలం'లో దళితుని స్థితిని ఈ కవి ఆవిష్కరించిన తీరు అద్భుతం...

**'వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు**
**భోజనము వెట్టు వానికి భుక్తి లేదు**
**వాని**
**తల మీద పులిమిన పంకిలమును**
**కడిగి కరుణింప లేదయ్యె గగన గంగ'**
**వాని నైవేద్యమున కంటు వడిన నాడు**
**మూడు మూర్తులకును కూడ కూడు లేదు'**

తత్ఫలితంగా పాఠకులకు ఒక హెచ్చరిక చైతన్యం, మేల్కొల్పు, అవగాహన కలిగింది.

ఈ ప్రయోజనంతో పాటు జాషువాలో అందమైన భావాలు మధుర మధురంగా వినిపిస్తాయి. రసమయమై కనిపిస్తాయి. మనసంతా నింపుకున్న ఒళ్లంతా పూసుకున్న కవనం కనిపిస్తుంది.

**'గగన కళ్యాణి గండ భాగమున**
**నిడ్డ**
**కాల పురుషుని గురు**
**నఖక్షతము బోలి**
**మంచు నవ్వుల నదె**
**చందమామ బుడుత**
**జననమైనాడు పశ్చిమ శైల**
**శిఖరి'**

ఆకాశం అనే కాంత బుగ్గపై కాల పురుషుడు తన గోటితో గాటు పెట్టాడా.. అన్నట్టుగా వంకర నెల వంక కనిపిస్తుందట.

ఇక్కడ ఉన్న ప్రకృతిని లేని మానవీకరణం చేసిన వైనం కనిపిస్తోంది. ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి.

అంటే కవిత్వమే ధ్యేయంగా సౌందర్యం, సందేశం రెండూ రెండు కళ్లుగా జాషువా కవన కాంత సాగిపోతూ ఉంటుంది.




వీటితో పాటు తేనెలూరే సొంపు లెగ్రదోసే తెనుగు నుడికారం మమకారంగా వినాలంటే జాషువా పద్యాలే చదవాలి.

జాషువా ఖండికలు రాసినా, లఘు కావ్యం అల్లినా, నాటకం ఆడించినా, ఈ గుణాలు అడుగడుగునా అక్షరాక్షరం కనిపిస్తాయి. గుబాళిస్తాయి. చదువరులకు చవులూరిస్తాయి. రస స్థాయిలో చిరస్థాయి చేస్తాయి.

తత్ఫలితంగా పాఠకులకు ఒక హెచ్చరిక చైతన్యం, మేల్కొల్పు, అవగాహన కలిగింది.

ఈ ప్రయోజనంతో పాటు జాషువాలో



అందమైన భావాలు మధుర మధురంగా వినిపిస్తాయి. రసమయమై కనిపిస్తాయి. మనసంతా నింపుకున్న వళ్లంతా పూసుకున్న కవనం కనిపిస్తుంది.

అంటే కవిత్వమే ధ్యేయంగా సౌందర్యం, సందేశం రెండూ రెండు కళ్లుగా జాషువా కవన కాంత సాగిపోతూ ఉంటుంది. వీటితో పాటు తేనెలూరే సొంపు లెగ ద్రోసే తెనుగు నుడికారం మమకారంగా వినాలంటే జాషువా పద్యాలే చదవాలి.

# శిష్యుడిగా చేరాలనుంది..

**యామిజాల జగదీశ్**

**ఓ రోజు ఒకడొచ్చాడు.**

**"సార్, ఓ గురువు దగ్గర శిష్యుడిగా చేరాలనుంది. మీకు తెలిసినవారెవరైనా ఉంటే చెప్పండి" అన్నాడు.**

**అతని మాటలు వింటుంటే గురువనేవాడు ఎక్కడో సంతలో వస్తువనుకున్నాడనిపించింది. గురువంటే డబ్బులు పెట్టి కొనుగోలు చేసే వస్తువు అనుకున్నట్టున్నాడు.**

నేనేదో ఈ విషయంలో అతనికి ఓ ఏజంట్ అన్నట్టుగా భావించాడేమో అనిపించింది. పదే పదే ఓ గురువుంటే చెప్పండి.. అని అంటుంటే. అప్పుడు నేనేం చేశానంటే వెంటనే నేను అతనిని నా ఎదుట కూర్చోబెట్టుకుని కాస్సేపటి వరకు నేను గురువుగా మారాను.

ఇలా నేనొక్కడినే కాదు, మన జీవితంలో ప్రతి ఒక్కరం ఏదో సందర్భంలో గురువవుతుంటాం. ఇందులో మన ప్రమేయం ఉండదు.

ఒక గురువు దగ్గర శిష్యుడిగా చేరడం ఎలా? అనే ప్రశ్నకు స్వామి శివానంద జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు చెప్పాను, ఆ మాటలు అతను నమ్ముతాడని.

హిమాలయ పర్వతశ్రేణి కింద ఋషికేశ్వరం ఉంది. అక్కడ స్వామి శివానంద ఉండేవారు. ఆయన ఓ ఆశ్రమం కూడా స్థాపించారు. దాని పేరు శివానందాశ్రమం. ఆయన వద్ద శిష్యరికం కోసం ఎక్కడెక్కడి నుంచో ఎందరెందరో వచ్చారు.


అలా వచ్చిన వారిలో ఒకడు "స్వామీ, నేనెంతో చదువుకున్నాను. మీ దగ్గరే ఉండిపోవాలని వచ్చాను" అన్నాడు.

"ఏం చదివావు?" అని అడిగారు స్వామి శివానంద.

అతనెంతో గొప్పగా "ఎం.ఎ.చదివాను" అన్నాడు.

వెంటనే స్వామి శివానంద "ఓహో! అలాగా.. మాస్టర్ ఆఫ్ అవిద్య అన్నమాట" అన్నారు స్వామి శివానంద.

మాస్టర్ ఆఫ్ అవిద్య అంటే అజ్ఞానంలో ఉన్నతుడు అని అర్థం. దానిని కుదించి ఎం.ఎ. అనేగా అనాలి. ఈ మాటకు అర్థం వినడంతోనే అతనిలో తానేదో గొప్పవాడనుకున్న అహం పటాపంచలైంది.



మరోసారి... ఓ ధనికుడు వచ్చాడు.... "తానూ శిష్యుడవాలనుకున్నాను" అన్నాడు.

స్వామీజీ అతని వంక తదేకంగా చూశారు. అతనిలో తానొక ధనవంతుడనే పాత్ర ఇవ్వమన్నారు.

స్వామి మాటగా ఆయన ఓ పాత్ర తీసుకొచ్చి ధనికుడికి ఇచ్చారు.

ఆ పాత్ర అందుకున్న ధనికుడు దాని వంక విచిత్రంగా చూశాడు. అటూ ఇటూ తిప్పి చూశాడు. ఏం చేయాలన్నట్టుగా స్వామి శివానంద వంక చూశాడు.

అప్పుడు శివానంద ఇలా అన్నారు...

"ఏంటలా చూస్తున్నారు? ఈ పాత్ర తీసుకుపోయి నాలుగు చోట్లకు వెళ్లండి. భిక్షమడిగి గోధుమ పిండి తీసుకురండి, ఆ పిండితో మనం చపాతీలు చేసుకుని తిందాం" అన్నారు స్వామి శివానంద.

ధనికుడు తెల్లబోయి నిల్చున్నాడు.

ఆత్మసాధన అనేది మామూలు విషయం కాదు. అదేమీ వినోదాత్మకమైనది కూడా కాదు. అహంకారం లేకుండా భిక్ష అడిగి తీసుకొచ్చి గురువుకు ఇవ్వడం అనేది సామాన్యమైన విషయం కాదు.

అందుకే ధనికుడు "అమ్మో! అది చాలా కష్టమైన పని" అనుకుని నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నాడు.

మరోసారి మరొకడు వచ్చాడు. స్వామికి నమస్కరించి "స్వామీ, ఈ రోజు నుంచి మీరే నా గురువు" అని చెప్పాడు.

అప్పుడు ఆయన "ఇలా నన్ను గురువనుకుని నాకో పదవి ఇచ్చినందుకు సంతోషం. ధన్యవాదాలు" అని ఇంగ్లీషులో చెప్పారు స్వామి శివానంద.

అయినా అతని వాలకమేమిటీ.. అతనే స్వామి దగ్గరకు వచ్చి ఏదో ఉద్యోగానికి అపాయింట్‌మెంట్ లభించినట్లు మీరే నా గురువని చెప్పడం ఏమిటీ?

ఇటువంటి సంఘటనలతో మనం తెలుసుకోవలసినవి:

ఓ గురువును శిష్యుడు ఎంపిక చేయలేడు. ఓ గురువు తన శిష్యుడిని ఎన్నుకోవచ్చు. అటువంటి పరిస్థితులు లేనందువల్లే ఈ రోజు ఎన్నో అవస్థలు.

ఓ విద్యార్థి గురువుతో "సార్, నన్ను మీరు తిట్టలేరు.. ఎందుకంటే నేను ఈ స్కూల్లో పది వేల రూపాయలు ఖర్చు పెట్టి ఈ సీటు కొనుక్కున్నాను" అని అనగానే టీచర్–

"అయినా నేను నిన్ను తిట్టడమేంటీ? కొట్టగలను కూడా అందుకు అవసరమైన యోగ్యత సంపాదించాను. ఎందుకంటే నేను ఇరవై వేల రూపాయలతో ఈ ఉద్యోగం సంపాదించుకున్నాను" అని చెప్పాడు. విద్యార్థి ఇక నోరు తెరిస్తే ఒట్టు....!

సింగిల్ పేజి కథ

# వాచీ చెప్పిన కథ

సత్య కందుకూరి

గాఢ నిద్రలో ఉన్న నేను ఒక్కసారి ఉలిక్కిపడి లేచాను. మా వాడు అల్మారాలో ఏదో వెతుకుతూ పెద్ద శబ్దాలు చేస్తున్నాడు. "ఏమి వెతుకుతున్నావురా?" అని అడిగాను మా వాడిని.

వాడు జవాబు చెప్తూ "వాచీ నాన్నా, నా పాత వాచీ వెతుకుతున్నా" అన్నాడు.

వీడికి చిన్నప్పటి నుంచీ వాచీలంటే మహా ఇష్టం. మేం ఎప్పుడు మాల్‌కి వెళ్లినా వాడు వాచీ కొనమని నన్ను తెగ ఇబ్బంది పెట్టేవాడు. వాచీలంటే మరీ ఖరీదయినవేమీ కాదు సుమండీ... మహా ఉంటే వందో, రెండు వందల రూపాయలలో ఉంటాయంతే. అదేమిటో మూడేళ్ల వయసు నుంచే వాడికి బొమ్మల కన్నా వాచీలంటే మహా పిచ్చి ఉండేది. వీడు ఆ కొత్త వాచీ పెట్టుకుని అపార్టుమెంట్లో అందరి ఇళ్లకి వెళ్లి నా కొత్త వాచీ అని చూపించేవాడు.

ఇంతలో వాడు ఒక బాక్స్ తీసి అందులో నుంచి వాచీ తీసి ఇది ఎవరిది నాన్నా? అని అడిగాడు.

ఆ వాచీ చేతిలోకి తీసుకుని చూస్తే అది మా నాన్నగారి రాడో వాచ్.... దాన్ని చూడగానే నా కళ్ల ముందు ఎన్నో మధురమైన జ్ఞాపకాలు కదలాడసాగాయి.

అప్పుడు అర్థమైంది ఈ వాచీల పిచ్చి వీడికి మా నాన్న గారి దగ్గర నుంచే అబ్బిందని.

నేను మొదటిసారి విదేశాలకు ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు మా నాన్న గారికి ఒక వాచీ కొనాలి అనిపించింది. అది నా మొదటి బహుమానంగా ఆయన పుట్టిన రోజున ఇవ్వాలి.. అనుకున్నా. ఒక మిత్రుడితో కలిసి నేను రాడో షోరూంకి వెళ్లాను. చాలా మోడల్స్ చూసి వాటిలో ఒకటి ఎంచుకుని రేటు చూసా. ఆ రోజుల్లోనే అది అక్షరాలా పదిహేడు వేల రూపాయలు. ఆ రోజుల్లో నా సంపాదనకది కొంచం ఎక్కువే అయినా నాన్న గారికి ఒక మంచి వాచీ కొనాలన్న ఆకాంక్షతో కొనేశాను. ఇంతలో నా స్నేహితుడు దీంతోపాటు ఒక గోల్డ్ చైన్ షాప్‌కి వెళ్లి ఒక చైన్ కూడా కొనేసాను.



నాన్నగారు చాలా నిజాయితీగా ఉండేవారు. పేరుకి ప్రభుత్వంలో పనిచేసే ఎలక్ట్రిక్ ఇంజనీర్ అయినా ఆర్జన అంతంత మాత్రంగానే ఉండేది. తోటి సహచరులు అన్ని విధాలా అక్రమార్జన చేస్తుంటే ఆయన మాత్రం నిజాయితీకి ప్రతిరూపంగా ఉండేవారు. దానికి ఆయనిచ్చే ఒకే ఒక సమాధానం "ఆ పాపిష్టి సొమ్ము మనకు వద్దు. దేవుడిచ్చిన దాంతోనే సుఖంగా బతకాలి" అని. ఆయన ఆలోచనలకు సరి సమానంగా మా అమ్మగారి ఆలోచనలు.

జీవితంలో అడుగడుగునా కష్టాలు ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నవారికి పిల్లలు ఎదిగి చేతికి వచ్చి ప్రయోజకులు అయితే అంతకన్నా కావాల్సినదేముంటుంది? అందుకు గొప్ప తార్కాణం.. మా అమ్మా నాన్నలు. ఇప్పుడు నాన్న గారి వయసు ఎనభై పనే ఉంటుంది. చేతికి వాచీ లేదు, బ్రేస్‌లెట్ లేదు. ఎందుకు తీసేసారంటే పెట్టుకునే ఓపిక లేదురా! అంటారు.

ఆరోజు నేను డబ్బుకి వెనుకాడి ఎందుకు కొనడం? అనుకుంటే ఈ రోజు ఇన్ని మధుర స్మృతులు నాకు దక్కేవి కావు. అందుకనే పెద్దలు ఏ సమయంలో చేయాల్సిన పని ఆ సమయంలో చేయాలి.. అనేవారు.

జీవితంలో డబ్బే ప్రధానం కాదు, విలువలు ప్రధానం అని చెప్పడానికి నాన్న గారి జీవితమే ఒక నిదర్శనం. మమ్మల్ని కూడా అలాగే పెంచారు, అలాగే జీవించమన్నారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు కానీ వ్యక్తిత్వం కోల్పోతే తిరిగి రాదు అనేవారు. నా ప్రకారం జీవితం జట్కాబండి అయితే విలువలు ఇరుసు.

మా వాడి దగ్గర నుంచి వాచీ తీసుకుని నాన్న గారికి చూపిస్తే ఆయన కంట నీరెట్టుకుని ఇక ఇప్పటి నుంచి దీన్ని వీడు పెట్టుకోవాలి.. అని ఆ వాచీ వాడి చేతికి పెట్టారు.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# తీరిన కల

కస్తూరి మురళీకృష్ణ






బుద్ధుడు జేతవనంలో విహరించే కాలంలో నలుగురు పరివ్రాజకుల గురించి చెప్పిన కథ.

.........

వైశాలిలో ఏడు వేల, ఏడు వందల ఏడుగురు లిచ్ఛవీ రాజులుండేవారు. లిచ్ఛవీ రాజులు వైశాలి ప్రాంతానికి చెందినవారు. వీరు నేపాల్‌ను గెలుచుకుని అక్కడ స్థిరపడ్డారు. కానీ ఈ కథా కాలానికి వీరు వైశాలిలోనే ఉన్నారు. ఒకరోజు వారందరిలోకీ అధిక పాండిత్యం ఉన్న నిర్గ్రంధుడు(బౌద్ధముని) వైశాలి నగరానికి వచ్చాడు.

వైశాలిలోని లిచ్ఛవులంతా ఆయనను సత్కరించారు. అంతలో అంతే పాండిత్యం కల నిర్గ్రంధి(బౌద్ధముని మహిళ) అక్కడకు వచ్చింది. వారిరువురి పాండిత్యం చూసి అందరికీ సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. వారిరువురి నడుమ శాస్త్రవాదం ఏర్పాటు చేశారు. వాదనలో గెలుపోటములు తేలలేదు. వారిద్దరూ సమానం అని తీర్మానించారు.

అప్పుడు వాళ్లిద్దరికి కలిగే సంతానం మేధావులవుతారని లిచ్ఛవీ రాజులందరికీ అనిపించింది. వాళ్లు వారిద్దరినీ కలిపి ఉంచారు. వారికి నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి పుట్టారు. సచ్చా, లోలా, అనువాదక, పటాచారు అన్నవి అమ్మాయిల పేర్లు. 'సచ్చకుడు' అన్నది కొడుకు పేరు. తన సంతానానికి తల్లి అయిదు వందల వాదాలు నేర్పింది. తండ్రి అయిదు వందల వాదాలు నేర్పాడు. తాము నేర్పిన వాదాలు క్షుణ్ణంగా వచ్చాయని వారు సంతృప్తి పడ్డారు తల్లిదండ్రులు. "మీరు ఒకవేళ గృహస్తుతో వాదం చేసి ఓడిపోతే ఆ గృహస్తుకు దాసుడు కావాలి. ప్రవ్రజితుడితో ఓడిపోతే ప్రవ్రజించాలి" అని చెప్పారు.

తల్లిదండ్రుల మరణం తరువాత సచ్చకుడు వైశాలిలోనే ఉండి లిచ్ఛవులకు విద్యలు నేర్పటం ఆరంభించాడు. అతని నలుగురు సోదరీమణులు నేరేడుకొమ్మ పట్టుకుని శాస్త్రవాదన కోసం ప్రతి నగరం తిరగటం ఆరంభించారు.

అలా తిరుగుతూ వారు శ్రావస్తి చేరారు. నగర ద్వారం దగ్గర ఆ కొమ్మను పాతారు. అక్కడ వున్నవారితో "మాతో శాస్త్రార్థులు చర్చ చేయగల సమర్థులు ఎవరైనా మీ నగరంలో ఉంటే- గృహస్తులు కానీ, ప్రవ్రజితులు కానీ ఈ నేరేడు కొమ్మను కాలితో తొక్కేయాలి. వారితో మేం వాదిస్తాం" అని చెప్పి భిక్షను అర్థించేందుకు నగరంలోకి వెళ్లారు.

తనకు నిర్దేశించిన పనులు సారిపుత్రుడు పూర్తి చేశాడు, ఊడ్చాడు. రాగిబిందెల నిండా నీళ్లు నింపాడు. గోసేవ చేశాడు. కాస్త పొద్దెక్కగానే భిక్ష సేకరణకు బయలుదేరాడు.

దారిలో నేరేడు కొమ్మను చూశాడు. విషయం ఏమిటని అడిగాడు. వారు విషయం చెప్పారు. వెంటనే మట్టిని తవ్వేశాడు. చెట్టుకొమ్మను అక్కడున్న వారితో తొక్కించాడు.

"ఈ చెట్టుకొమ్మను ఇక్కడ పాతి, వాదనకు ఆహ్వానించినవారు భోజనం తరువాత జేతవనం ద్వారం దగ్గరకు వస్తే నన్ను కలవవచ్చు, వాదించవచ్చు" అని చెప్పమని వారితో వచ్చాడు.

భిక్ష సేకరించిన తరువాత జేతవనం ద్వారం దగ్గరకు వచ్చి నుంచున్నాడు. ఈ లోగా భిక్షాటన పూర్తయిన నలుగురు సోదరీమణులు తాము నేరేడుకొమ్మ పాతిన స్థలానికి వచ్చి, అది చెదిరి ఉండటం చూశారు. "ఎవరు దీన్ని ఇలా చేశారు?" అని అడిగి తెలుసుకున్నారు. జేతవన విహారానికి చేరుకున్నారు.

విహార ద్వారం వద్దనే స్థవిరుడు కలిశాడు. స్థవిరుడిని వారు వెయ్యి ప్రశ్నలు అడిగారు.

సారిపుత్రుడు అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చాడు. వారి దగ్గర ప్రశ్నలన్నీ అయిపోయాక, "నేను మిమ్మల్ని ఏమైనా అడగవచ్చా?" అని అడిగాడు.

"అడగండి. తెలిస్తే సమాధానం ఇస్తాం" అన్నారు వారు.

"ఒక్కమాట యేది?" అనడిగాడు.

వారికి అర్థం కాలేదు. సమాధానం తెలియలేదు. ఓటమిని అంగీకరించారు.

"సమాధానం మీరే చెప్పండి" అన్నారు. స్థవిరుడు ఆ సమాధానాన్ని వారికి వివరించాడు. "మీరు ఓడిపోయారు.

గృహస్థుతో ఓడిపోతే మేం గృహిణులం కావాలి. ప్రవ్రజితుడితో ఓడిపోతే మేం ఆయన దగ్గర ప్రవ్రజ్యమొందాలి అని మా తల్లితండ్రుల ఆజ్ఞ. కాబట్టి మాకు ప్రవ్రజ్యాన్ని అనుగ్రహించండి" అన్నారు వారు.

"సరే" అని అతడు వాళ్లని ఉత్పలవర్ణ స్థవిరుడి దగ్గరకు పంపించాడు.

వారు ప్రవ్రజించారు. త్వరలో అర్హత్వం పొందారు.

ఇది ధర్మసభలో భిక్షువుల నడుమ చర్చనీయాంశమయింది.

"సారిపుత్ర స్థవిరుడు నలుగురు ప్రవ్రజలకు అర్హత్వం సమకూర్చాడ"ని వారంతా విశేషంగా చెప్పుకోసాగారు. ఆ సమయానికి శాస్త్ర(బుద్ధుడు) అక్కడికి వచ్చాడు. వారు ఏ విషయం చర్చిస్తున్నారో తెలుసుకున్నాడు.

"భిక్షువులారా, ఇప్పుడే కాదు పూర్వంలో కూడా ఇతడు వీరికి సహాయం చేశాడు. ఇప్పుడు సర్వసంగ పరిత్యాగులను చేశాడు. కానీ పూర్వం వీరిని పట్టమహిషి పదవిలో నిలిపాడు" అన్నాడు.

భిక్షువులందరూ ఆ పూర్వ కథ వినాలన్న ఉత్సుకతను వ్యక్తం చేశారు.

శాస్త్ర వారికి ఆ కథ చెప్పటం ప్రారంభించాడు.

..........

పూర్వం కళింగ రాజ్యంలో దంతపురం అనే నగరం ఉండేది. ఆ దంతపుర రాజు కళింగుడు. ఆ సమయంలో అశ్వక రాష్ట్రంలోని పోతలి నగరం రాజు అశ్వకుడు. కళింగుడు నాగబల సంపన్నుడు. అతడి దగ్గర పెద్ద సైన్యం ఉండేది. అతడు యుద్ధకాముకుడు. అతడు తన సైన్యాధికారులను పిలిచాడు.

"నాకు యుద్ధం అంటే ఇష్టం. కానీ యుద్ధం చేయటానికి నాకు శత్రువులు ఎవరూ కనబడటం లేదు.

నేను ఏం చేయాలి?" అని అడిగాడు.

వారు ఆలోచించారు... చివరికి రాజుతో "రాజా! మాకు ఒక ఉపాయం తోస్తోంది. మీకు నలుగురు పుత్రికలున్నారు. వారిని అలంకరించి, తెరలు కట్టిన రథంలో కూర్చోబెట్టి, పల్లెలు, పట్టణాలలో తిప్పండి. ఆ రథాల వెంట సైన్యాన్ని నడపండి. ఏ రాజు వారిని తన దగ్గర ఆపేస్తాడో, ఆ రాజుతో యుద్ధం చేయవచ్చు".

కళింగుడికి ఈ ఆలోచన నచ్చింది. వెంటనే సేనాధిపతులు ఇచ్చిన ఆలోచనను అమలు పరచాడు. కానీ రాజు భయంతో ఎవ్వరూ తమ నగరాలలోకి ఈ రథాలను రానీయలేదు.

రథాలను నగరం బయటే నిలిపి కానుకలు పంపి "మా నగరంలోకి రాకండి. వెళ్లిపోండి" అని అభ్యర్థిస్తున్నారు. దాంతో యుద్ధం చేయాలన్న కళింగుడి కోరిక తీరటమే లేదు. అలా జంబూద్వీపమంతా తిరిగి తిరిగి ఆ రథం అశ్వక రాష్ట్రంలోని పోతలి నగరం చేరింది. అశ్వకరాజు కూడా కానుకలు పంపి, యుద్ధం నుంచి తప్పించుకోవాలని అనుకున్నాడు. కానీ ఆయన మంత్రి నందిసేనుడు రాజును వారించాడు. నందిసేనుడు విద్వాంసుడు, బుద్ధిమంతుడు, తెలివైనవాడు. కానుకలు పంపించి రాజు నగర ద్వారం మూయించినా నందిసేనుడు మరో విధంగా ఆలోచించాడు.

"ఈ రాకుమార్తెలను జంబూ ద్వీపమంతా తిప్పినా, ఒక్కరాజు కూడా యుద్ధానికి సిద్ధం కాలేదు. ఇది జంబూద్వీపం మొత్తానికి అవమానకరం. ఇది కళింగుడికి అహంకారం కలిగిస్తుంది. కాబట్టి నేను కళింగుడితో యుద్ధం చేస్తాను" అని అనుకున్నాడు.

అప్పటికే నగర ద్వారాలు మూసివేశారు. ఆయన వెళ్లి పుర ద్వారాలను తెరిపించాడు.

ఆ నలుగురు రాకుమార్తెలను సగౌరవంగా నగరంలోకి ఆహ్వానించాడు. వారిని రాజు దగ్గరకు తీసుకువెళ్లాడు.

"రాజా, ఈ నలుగురిని రాణులుగా స్వీకరించండి" అన్నాడు.

రథం వెంట ఉన్న సైనికులకు వారి రాజుకు ఈ విషయం చెప్పమన్నాడు.

"అశ్వకరాజా, ఈ నలుగురిని తన రాణులుగా స్వీకరించాడని చెప్పండి... పొండి" అన్నాడు.

వారు వెళ్లి కళింగుడికి ఈ విషయం చెప్పారు. వార్త విన్న కళింగుడు సంతోషించాడు. "ఇన్నాళ్లకి నా యుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం లభించింది" అని సంతోషించాడు. పెద్ద సైన్యంతో యుద్ధానికి బయలుదేరాడు.

కళింగుడు యుద్ధానికి వస్తున్న వార్త తెలియగానే మంత్రి నందిసేనుడు రాజుతో "రాజా, కళింగుడికి సందేశం పంపించండి. యుద్ధం మన రాజ్యాల సరిహద్దు దగ్గర జరుగుతుంది. మీరు సరిహద్దు దాటవద్దు.. అని సందేశం పంపించండి" అన్నాడు.

రాజు అలాగే సందేశాన్ని కళింగుడికి పంపించాడు.

సందేశం అందుకున్న కళింగుడు సరిహద్దు దాటలేదు. సరిహద్దుకు ఆవలనే సైన్యాన్ని నిలిపాడు.

అశ్వకుడు కూడా తన సరిహద్దుకు ఆవలనే సైన్యాన్ని నిలిపాడు. సరిహద్దు దాటలేదు.

ఆ కాలంలో బోధిసత్త్వుడు ఈ రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఓ పర్ణకుటీరంలో నివసిస్తూండేవాడు. పరిసర రాష్ట్రాలలో ప్రవ్రజిస్తూండేవాడు.

ఈ విషయం తెలిసిన కళింగుడికి ఓ ఆలోచన వచ్చింది. "శ్రమణులకు భవిష్యత్తు తెలుస్తుంది. కాబట్టి యుద్ధంలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో ఆయనను అడిగి తెలుసుకుంటాను" అనుకున్నాడు.

మారువేషంలో బోధిసత్త్వుడి దగ్గరకు వెళ్లాడు. వందనం చేశాడు.

"ప్రస్తుతం ఇక్కడంతా యుద్ధ మేఘాలు ఆవరించి ఉన్నాయి. కళింగుడు, అశ్వకుడు సరిహద్దుకిరువైపుల సైన్యాలను మోహరించి ఉన్నారు. ఈ యుద్ధంలో గెలుపెవరిది? ఎవరికి ఓటమి?" అనడిగాడు.

"కళింగుడు గెలుస్తాడు, దేవరాజు శనుని సంప్రదించి చెప్పాడు బోధిసత్త్వుడు.

అది విన్న కళింగుడు సంతోషించాడు. ఈ వార్త కార్చిచ్చులా అంతటా వ్యాపించింది.

"మనం ఓడిపోతామా?" అడిగాడు అశ్వకుడు.

"రాజా, జయాపజయాలు ఎవ్వరూ నిర్ణయించలేరు. మీరు భయపడకండి"

"రాజా, ఈ నలుగురిని రాణులుగా స్వీకరించండి" అన్నాడు నందిసేనుడు. రథం వెంట ఉన్న సైనికులకు వారి రాజుకు ఈ విషయం చెప్పమన్నాడు. "అశ్వకరాజా, ఈ నలుగురిని తన రాణులుగా స్వీకరించాడని చెప్పండి" అన్నాడు.

అని స్వయంగా బోధిసత్త్వుడి దగ్గరకు వెళ్లాడు నందిసేనుడు.

"మీరు ఎలా చెప్తారు కళింగుడు గెలుస్తాడని?" ప్రశ్నించాడు.

"కళింగుడికి తెల్ల ఎద్దు రక్షక దేవత. అశ్వకుడికి నల్ల ఎద్దు. రక్షక దేవతలే జయాపజయాలు నిర్ణయించేది" చెప్పాడు బోధిసత్త్వుడు.

"ఇవి రాజులకే కనబడతాయి"

వెంటనే నందిసేనుడు రాజు కోసం ప్రాణాలర్పించే వెయ్యి మంది సుశిక్షితులైన సైనికులను పిలిచాడు. రాజుకు విషయం వివరించాడు.

ఈ సమయంలో కళింగుడి సేనలో విజయం తమదే అన్న ఉత్సాహం కలిగింది. వారు అశ్రద్ధ వహించారు. విశ్రమించటం ఆరంభించారు.

ఈ సమయంలో నందిసేనుడి సూచనలను అనుసరించి, అశ్వకుడు సేనలతో నిర్లక్ష్యంగా విశ్రమిస్తున్న కళింగుడి సైన్యంపై విరుచుకు పడ్డాడు.

తిన్నగా విజయ సూచకమైన తెల్ల ఎద్దుపై దాడి చేసి దాన్ని ముక్కలు ముక్కలు చేశాడు.

ఈ దాడి కళింగుడిలో, కళింగుడి సైన్యంలో భయం కలిగించింది. వారు చెల్లాచెదురయిపోయారు. కళింగుడు పారిపోయాడు.

"నీ పుత్రికలను నేను వివాహమాడుతున్నాను. నాకు కానుకలు పంపించండి" అని కళింగుడికి వర్తమానం పంపించాడు అశ్వకుడు.

తీరిక చిక్కినప్పుడు నందిసేనుడితో "పరివ్రాజకుల మాట తప్పు కాదు కదా. మరి ఇదెలా సాధ్యమయింది?"

"రాజా, గెలుస్తామన్న ధైర్యంతో గెలవక ముందే సంబరాలు చేసుకున్నారు. అందుకని వారు ఓడారు. మనం ఓడిపోతామని తెలిసినా మన దృష్టి మరలనివ్వలేదు. లక్ష్యం నుంచి దృష్టి తప్పనివాడిదే విజయం" వివరించాడు నందిసేనుడు.

ఆ నలుగురు రాకుమార్తెలు అశ్వకుడి పట్టపు రాణులయ్యారు.

"ఆ కాలంలో నలుగురు రాకుమార్తెలు ఇప్పటి భిక్షువులు. సారిపుత్రుడు నందిసేనుడు. తపస్విని నేనే" కథ ముగిస్తూ చెప్పాడు బుద్ధుడు.

# భారతావని-విజ్ఞాన ప్రదాయిని

డా॥ పులివర్తి కృష్ణమూర్తి



విశ్వమానవ సంక్షేమాన్ని కాంక్షించే శ్రేయోస్వరూపిణి, విజ్ఞాన ప్రదాయినీ యీ భారతావని. సువిశాల భారతదేశంలో వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు వున్నా వాటిలో నుండే ఒక సమైక్య భావాన్ని పెంపొందించే ప్రయత్నం గావించారు మన పూర్వీకులు. లోకంలోని ప్రతిఒక్కరూ ప్రయోజనాత్మకమైన, ప్రశాంత జీవితాన్ని గడపాలని వారికి ఆ విధమైన సామర్థ్యాన్ని చేకూర్చాలన్నదే వారి ఆకాంక్ష.

ప్రజల్లో ఆధ్యాత్మిక దృష్టి, సేవా దృక్పథం పెంపొందింపజేయాలన్న ఉద్దేశంతోనే ఎందరో ఎన్నో విధాలుగా తమ ప్రయత్నాలు కొనసాగించారు. క్షణ క్షణం మారుతున్న సమాజ వైఖరి, జనుల మనస్తత్వాలు, విద్రోహ చర్యలు, దౌర్జన్య కాండలు రోజురోజుకీ పెరిగిపోతున్న ఈ రోజుల్లో, నాగరికత వెల్లువలో పడి దిక్కుతోచక, ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనావళికి వెలుగుబాట చూపాలనే పరమార్థంతో జ్ఞానకాంతులు వెదజల్లుతూ వారితో ధర్మాసక్తిని పెంచి కర్మవీరులుగా తీర్చిదిద్దే ప్రయత్నం గావిస్తున్నవారు ఎందరో ఈ నవనాగరిక సమాజంలోనూ కనిపిస్తూ వుండటం ముదావహం. ప్లేటో మహనీయుడు అప్పుడెప్పుడో చెప్పాడు.

"ఎ నేషన్ కెనాట్ స్ట్రాంగ్ అన్‌లెస్ ఇట్ బిలీవ్స్ ఇన్ గాడ్"

భగవంతుడి మీద విశ్వాసం వుంటేనేగాని ఏ దేశమూ పటిష్ఠం కాలేదు. అందుకు ఆత్మజ్ఞానం తోడు కావాలి. వారికి జీవిత విలువల్ని గుర్తు చేయాలి. మానవుల్లో గూడు కట్టుకున్న సంకుచిత తత్వాన్ని తుడిచిపారెయ్యాలి. వినయం, వివేకం, క్రమశిక్షణ, సత్యవర్తనం ప్రధానంగా చిన్నారులను పెంచాలి. మత వైషమ్యాలు వైదొలగాలి. మతమంటే 'అనుభూతియే.. మంచిని పెంచేదే మతం'. (మంచితనం, మనిషికులం, మానవ సేవా వ్రతం, దైవానికి ప్రీతికరం).

మానవుడు నడుచుకోవాల్సిన విధానమే 'విధి'. దాన్నే రుషులు ధర్మం అన్నారు. 'యతో ధర్మ స్తతో జయః' అనే విధంగా ధర్మాన్ని రక్షించేవారిని ధర్మం రక్షిస్తుంది. భగవద్గీత కూడా 'ధర్మం' శబ్దంతోనే ప్రారంభమవుతుంది. ధర్మానికి హాని సంభవించినప్పుడల్లా తాను అవతరించి ధర్మోద్ధరణ చేస్తానని 'ధర్మమ సంస్థాపనాయ సంభవామి యుగే యుగే' అంటూ అభయమిచ్చాడు కదా! అలాంటి ధర్మాచరణకు ముఖ్యంగా కావాల్సింది చిత్తశుద్ధి. అదెలా సాధ్యపడుతుందంటే సత్సాంగత్యం వలన అని చెప్పుకోవాలి. విజ్ఞాన సాగరులైన సత్పురుషుల సాంగత్యం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. అట్టి సత్సాంగత్యం లేనివారు పుట్టంధులు. పుట్టుకతోనే చెవిటివారు, జన్మతః మూగవారి కిందే జమ అని అంటారు మహాత్ములు. చిత్తశుద్ధిలేని శివపూజ ఏలరా అన్నారు వేమనయోగి. మనిషిలో భక్తి జ్ఞాన వైరాగ్యాలు కుదురుకోవాలంటే చిత్తశుద్ధి వుండాలి. మానవుడంటే మాయలో పడకుండా, అజ్ఞానంలో చిక్కకుండా మనగలవాడు. మానవునిలో సహజమైన భగవన్నిక్షిప్తాలైన శక్తి సామర్థ్యాలున్నాయి. వివేకముంది. వివేకం అన్నది అలౌకిక శక్తి. ఆ శక్తిని వికసింపజేసుకోవడంలోనే ఉంది మానవుడి ప్రతిభ. అట్టి ప్రతిభను సంపాదించుకుంటేనే జ్ఞాన, వైరాగ్యాలు కుదురుకుంటాయి. నిర్మలమైన మనస్సే మోక్ష కారకంగా వుంటుంది. కొందరు మోక్షం అనగానే మరణం అనుకుని గతుక్కుమంటారు. పురాణ శ్రవణం, గీతా పారాయణం వయోవృద్ధులకే పరిమితం అని అనుకోవడం కొందరు అనుకోవడం కద్దు. అది పొరపాటు. గీతా పారాయణాదులు చిత్తశుద్ధినీ, శీల నైర్మల్యాన్నీ కలుగజేస్తాయి, కర్తవ్యాన్ని బోధిస్తాయి. మోక్షం అంటే విడుదల అని కూడా అర్థం వుంది. అంటే మోహం నుండి, అహంకార మమకారాల నుండి, రాగద్వేషాల నుండి, ఆశాపాశాల నుండి, భయభ్రాంతుల నుండి, అసూయ, అశాంతి, స్వార్థపరత, పగ, పక్షపాత బుద్ధుల నుండి మనస్సుకు విడుదల అన్నమాట. బంధమోక్షాలకి మనస్సే కారణం. ఆ మనస్సును అదుపులో ఉంచడాన్నే ఆత్మనిగ్రహం అంటారు. 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అనే సిద్ధాంత బలంతో సత్య పదార్థాన్ని చూడటమే ఆత్మజ్ఞానం. 'జ్ఞానం సమ్యగ వేక్షణమ్' అంటే ఉన్నది ఉన్నట్లు, లేనిది లేనట్లు చూడగలగడమే జ్ఞానం. క్షణికమైన వాటికోసం ఆరాటం ఆవేదన పడటం అజ్ఞానం. 'ఆత్మే పరమాత్మ' 'జీవుడే దేవుడు' అన్న సత్యాన్ని తెల్సుకోవడం ముఖ్యం. ఎఱుక, దైవకృప, సత్సాంగత్యంతోనే సాధించుకోవల్సి వుంది. అందుకు కావాల్సింది శ్రద్ధ. 'శ్రద్ధవాన్ లభతే జ్ఞానం' అన్నారు. ఏకాగ్రత, సాధన, ఇంద్రియ నిగ్రహం, మనోబలం ఉన్నప్పుడే అది సాధ్యం.

ఆత్మవిశ్వాసమే ఆత్మోన్నతికి కారణం. అందువలన అజ్ఞాన నిద్ర నుండి మేల్కొనండి. ఆత్మ తత్వాన్ని తెల్సుకునేందుకు జాగరూకులు కండి. మహనీయుల ప్రబోధాల్ని ఆలకించండి.. అంటూ ఉపనిషత్తులు జనాలను జాగృతం చేస్తున్నాయి. 'తత్వమసి'.. ఆ పరమాత్మయే నీవు అని ఒక్క వాక్యంలో సందేశమిస్తున్నాయి. ఇది ప్రబోధం. ఈ 'తత్వమసి' అన్న మహా వాక్యాన్ని, జీర్ణం చేసుకుని, 'అహం బ్రహ్మాస్మి' అనే ఉపనిషత్ ఘోషను ఆలకించి క్రమశిక్షణతో అనుష్ఠించినప్పుడే ఆత్మ జ్ఞాన సంపన్నులయ్యే అవకాశం వుంది. మానవునికి శాంతినీ, క్షేమాన్నీ కలిగించి భవసాగరం నుండి ఒడ్డుకు చేర్చగలిగేదే ఆత్మజ్ఞానం పారమార్థిక విద్యే. ఈ విద్య ద్వారా శాంతి, దాని పరిణామం, వినియోగం 'పరోపకారం'. ఆ ఉపకార ప్రతిఫలం 'జన్మసాఫల్యం'.



# ఈ దోషం తీసివేస్తే..

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



మానసిక సమస్యలతో బాధపడుతున్నాం.. అని తెలియకుండానే ఆ సమస్యతో బాధపడుతున్నటువంటివాళ్లు చాలామంది ఉన్నారు. మానసిక సమస్యల గురించి ప్రత్యేకమైనటువంటి చికిత్సలు ఉన్నాయి. చంద్రుడు మనః కారకుడు. మనసుకి చంద్రుడికి సంబంధం ఉంటుంది. మనసు స్వభావం చంచలమైనది. వాయువు ధర్మం చంచలమైనది. అందుకే వాస్తు శాస్త్రంలో వాయువ్యాన్ని మనసుని కలిపి చెప్పారు. ఉత్తరం, పడమర దిక్కులు కలిసే మూలను 'వాయువ్య మూల' అంటారు. అది 'వాయుదేవుడు' అధిష్టించినటువంటి చోటు కాబట్టి దాన్ని 'వాయువ్యం' అన్నారు. వాయువు స్వతంత్ర అభిలాషి. ఒకచోట ఉండదు. మనసులో కూడా ఆలోచనలు ఎప్పుడూ ఒకచోట ఉండవు. ఎవరైనా కొంచెం అర్థం కానట్టు అయోమయంగా ప్రవర్తిస్తూ వుంటే 'వీడికి ఏదో గాలి సోకినట్టుంది' అని పెద్దవాళ్లు అనేవాళ్లు.

కొంతమంది క్రమంగా సన్నగా తయారైపోతారు. "గాలి సోకింది కాబట్టి అనారోగ్యం చేసింది" అంటారు. కొంతమందికి మనసు శరీరం రెండు కృషించిపోతాయి. కొంత మందికి శరీరం మాత్రం కృషించిపోతుంది. కొంత మందికి మనసు మాత్రం కృషిస్తుంది. కానీ శరీరం బాగానే ఉంటుంది. మనసు కృషించిపోవటం బయటికి భౌతికంగా కనపడదు. కొంతమందికి శరీరం కృషించిపోతుంది. మనసు బాగానే ఉంటుంది. ఆ బాగుండటం అనేది విపరీతంగా ఉంటుంది.

చాలామంది శ్మశానాల దగ్గర ఇల్లు కట్టుకుని ఉంటారు. అక్కడ సమాధిలో పైనుండి వచ్చేగాలి, చితిమంటలపై నుండి వచ్చే గాలి, కర్మకాండలను నిర్వహిస్తున్నప్పుడు వచ్చే గాలి ఆ చుట్టుపక్కల ప్రాంతాల మీద, ఆ ఇళ్ల మీద తప్పకుండా ప్రభావాన్ని చూపెడుతుంది. అటువంటి వైబ్రేషన్స్ వల్ల అక్కడ నివసించే వాళ్లలో కొందరు తమ మానసిక సంతులతను కోల్పోయే అవకాశం ఉంటుంది. మానసిక అనారోగ్యం, శారీరక అనారోగ్యం సంభవించే అవకాశం ఉంటుంది. అందుకని ఇటువంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంతవరకు అటువంటి ప్రాంతాల్లో నివసించకూడదు.

ముఖ్యమైన విషయం ఏమిటంటే మనసుకు సంబంధించి గాలివాటం ఎక్కువగా పని చేస్తుంది. వాయువ్యంలో బావి ఉన్నట్లయితే ఆ వాయువ్యం దిక్కు దోషపూరితమవుతుంది. బావిలో ఉత్పన్నమయ్యే కొన్ని రకాల విషపూరిత గాలులు, కార్బన్‌డైఆక్సైడ్ లాంటివి ఆ ఇంట్లోకి ప్రవేశించటంచేత ఆ గాలులని ఆ ఇంట్లోవాళ్లు నిరంతరం పీలుస్తూ ఉండడం వల్ల వాళ్లు క్రమంగా ఎన్నో రకాల మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉంటుంది.

చాలామంది వ్యాపార, వ్యవహారాలలో తీవ్ర నష్టాలకు గురై, మానసిక అనారోగ్యానికి లోనయ్యే ముఖ్యమైన కారణం లేదా దోషం కూడా వాయువ్య దిశలో ఉంది.

ఇది ఎటువంటి సందర్భాలలో జరుగుతుందంటే– వాయువ్య మూలలో ఏదైనా ఒక నిర్మాణం చేసి పెట్టినప్పుడు అంటే టాయిలెట్‌గానీ, బాత్రూంగానీ, స్టోర్ రూమ్‌గానీ ఆ మూలన కట్టినప్పుడు, ఆ మూలన గాలి స్వతంత్రంగా తిరగటానికి వీలు లేకుండా బంధింపబడుతుంది. ఈ దోషం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయి. ఆ ఇంట్లో నివసించేవాళ్లు చేయాలనుకున్న పనిలో స్వాతంత్రం లోపించడం మొదటిది. పని చేయాలనుకున్నప్పుడు చేస్తారు. కానీ పనిని ఏ విధంగా చేయాలనుకుంటారో ఆ విధంగా చేయలేరు. వ్యాపారం చేస్తారు.కానీ ఆలోచించిన పద్ధతిలో అవి క్రియాశీలంగా జరగవు. ఫలితంగా నష్టం వాటిల్లుతుంది. సమయం వృథా అవుతుంది. ఈ విధమైన నష్టాలు పునరావృతం అవుతూ ఉండటం చేత క్రమంగా ఒక రకం 'డిప్రెషన్'లోకి వెళ్లిపోతారు. అక్కడి నుండి మానసిక సమస్యలు మొదలవుతాయి. ఆ వాయువ్య మూలన విడిగా కట్టి ఉన్న గదిని తీసివేస్తే పరిస్థితులు మళ్లీ మామూలు స్థితికి వస్తాయి. కానీ ఇటువంటి సవరణలు వాస్తు నిపుణుల పర్యవేక్షణలో చేసుకోవటం ఉత్తమం.

మానసిక సమస్యలు ఎక్కువగా వచ్చినప్పుడు వాటికి కారణాలు అనేక రకాలుగా ఉంటాయి. వాయువ్య దోషం వల్ల మానసిక సమస్యలు వస్తున్నాయి అని అర్థం చేసుకోవచ్చు. వంశపారంపర్యంగా వచ్చే మానసిక సమస్యల గురించి నేను చెప్పటం లేదు. వాయువ్య దోషం వలన కలిగే నష్టాల నుండి ఊరట పొందటానికి ఉన్న పద్ధతులలో వాయుదేవుణ్ణి ప్రసన్నం చేసుకోవడం అనేది ఒక సులభమైన పద్ధతి. వాయుదేవునికి అతి ప్రీతిపాత్రమైనవాడు, వాయుపుత్రుడు హనుమంతుడు. హనుమంతుని, వాయుదేవుని ప్రసన్నం చేసుకునే ఏవైనా స్తోత్రాలు చేయటం, పూజా మందిరంలో తూర్పుకు అభిముఖంగా కానీ, వాయువ్యంలో పశ్చిమానికి అభిముఖంగా గానీ కూర్చుని/నిలబడి హనుమాన్ చాలీసా చదువుకోవచ్చు. టేప్‌లో రికార్డు చేసిన 'హనుమాన్ చాలీసా' లేదా 'సుందరకాండ' పారాయణం తగ్గ స్థాయిలో వినపడేటట్టు ఇంట్లో ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటివి చేయటం వల్ల అక్కడ వాయుదేవుడు ప్రసన్నం చెందుతాడు. వాయువ్యానికి సంబంధించి మనకు తెలియని దోషాలు ఏవైనా ఉంటే అవి క్రమంగా పరిహరింపబడతాయి లేదా పలచనవుతాయి. క్రమంగా మంచి ఫలితాలు కనిపిస్తూ ఉంటాయి.

కొన్ని దోషాల గురించి మాత్రమే నేను మీకు వివరిస్తున్నాను. మానసిక సమస్యలు ఉన్నవాళ్లు మందులు తీసుకోవాలి. డాక్టర్ దగ్గరికి వెళ్లాలి. 'కన్సల్టేషన్స్' అన్నీ చేయాలి.

గృహానికి ఉండే వాస్తుదోషాలు క్రమంగా తగ్గిపోయి, మానసిక సమస్యలు కూడా క్రమంగా తగ్గుముఖం పడతాయి. వ్యాపార వ్యవహారాలు అనుకూలంగా మారుతాయి. ఇందులో సందేహం ఏమీ లేదు.

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



వినోద కార్యక్రమాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. ఏ పని చేపట్టినా సమర్థవంతంగా పూర్తి చేస్తారు. షేర్లు, భూముల క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. మిత్ర బృందంతో చర్చలు సాగిస్తారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. స్వల్ప అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది.

## వృషభం



ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సంఘంలో మీకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంటారు. గతంలో మీకు సానుకూలపడని వ్యవహారాలు ఇప్పుడు సానుకూలపడతాయి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ప్రభుత్వపరమైన కొన్ని కాంట్రాక్టులు, లీజులు, లైసెన్సులు కలిసి వస్తాయి.

## మిథునం




ప్రతి విషయంలోనూ నిరాశకు గురి చేయడం, ఇబ్బందికరమైన మాటలు వినటం పెద్ద సమస్యగా మారుతుంది. ఇలా మాట్లాడే వారికి దూరంగా ఉండాలన్న ఆలోచనలు ఆచరణలో పెట్టలేరు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తగ్గిపోతుంది. వైద్య విద్యలపై ఆసక్తి కనబరుస్తారు.

## కర్కాటకం



అనుకూలమైన వాతావరణం నూతనోత్సాహం ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెంపొందుతాయి. సమీప బంధువులను కలుస్తారు. భవిష్య ప్రణాళికల గురించి చర్చించి, అధిక లాభాలు వచ్చే స్వల్పకాలిక వ్యాపారాలలో ధనాన్ని పొదుపు చేస్తారు.

## సింహం



గృహ సమస్యల నుంచి బయట పడతారు. స్నేహ ఒప్పందాలు బలపడతాయి. వృత్తి సంబంధమైన అభివృద్ధిలో ఆటంకాలు తొలగిపోతాయి. వెన్నునొప్పి బాధించే సూచనలు ఉన్నాయి. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. నిందలకు దూరంగా వుండటానికి ఈ సూచన. వివాదాలకు దూరంగా ఉండండి.

## కన్య



ఆర్థిక సంబంధ వ్యవహారాలలో లోటుపాట్లు తప్పక పోవచ్చు. విపరీతమైన పని వత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అకారణంగా మిత్రులతో విరోధం రాకుండా జాగ్రత్త పడండి. దైవానుగ్రహం అన్ని వేళలా అండగా ఉంటుంది. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. ధైర్యంతో తీసుకున్న ఒక నిర్ణయం సరికొత్త మలుపుకు దారి తీస్తుంది.

## తుల



దేవాలయాలు సందర్శిస్తారు. మీ పరిజ్ఞానానికి ప్రశంసలు లభిస్తాయి. కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారానికి, ఉద్యోగానికి సంబంధించిన ఉపయోగకరమైన సమాచారం అందుకుంటారు. మాట తొందరపాటు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసే సూచనలు ఉన్నాయి, జాగ్రత్తగా ఉండండి. సంస్థలో మీ సహచరుల సౌజన్యంతో కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

## వృశ్చికం



మీ తెలివితేటలు, నైపుణ్యం ప్రదర్శించటానికి ఒక చక్కని అవకాశం మీ ముందుకు వస్తుంది, నేర్పుగా ఉపయోగించుకోండి. కొనుగోలు-అమ్మకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ప్రశాంతంగా ఆలోచించి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం వల్ల అధికంగా లాభపడతారు. సిద్ధగంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అర్చన జరిపించండి. రహస్య శత్రువులు వెలుగులోకి వస్తారు. నరఘోష అధికంగా ఉంటుంది.

## ధనుస్సు



ఇతరులను మెప్పించి మీ పనులు సానుకూలపరచు కుంటారు. అదృష్టం కలిసి వస్తుంది. ఒక ఆహ్వానానికి, ప్రకటనకు లేదా ఉత్తరానికి మీరు ప్రతిస్పందిస్తారు. చేపట్టిన కార్యంలో విజయం లభిస్తుంది. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. కార్యాలయంలో నూతనోత్సాహంతో శ్రమించి మంచి ఫలితాలు సాధిస్తారు. మీకు అందాల్సిన సమాచారం సాంకేతిక లోపం వల్ల సకాలంలో అందకపోవచ్చు.

## మకరం



ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఎదురు చూడని అవకాశాలు కలిసి వస్తాయి. వాటిని నేర్పుగా ఉపయోగించుకోండి. గోశాలలో గరిక దానం చేయండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. విదేశాల్లో వున్నవారి సొంతింటి కల నెరవేరుతుంది. సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం.

## కుంభం




వృత్తి, ఉద్యోగ, వ్యాపార సంబంధమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి. ఒకానొక ప్రయాణం మీకు అనుకూలంగా మారుతుంది. శుభ వార్తలు వింటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. వ్యాపార లావాదేవీలు అనుకూలంగా వుంటాయి. ముఖ్యమైన సమస్యలు పరిష్కారమవుతాయి. సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.


## మీనం




వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యతనిస్తారు. కొనుగోళ్లకు అధిక ధనం ఖర్చు చేస్తారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుని, వాటిని అమలు చేస్తారు. యోగాభ్యాసం, ప్రకృతి వైద్యం ఆకర్షిస్తాయి. కుటుంబంలో ఐకమత్యం ప్రశాంతతను ఇస్తుంది. వ్యాపారంలో రొటేషన్ లాభాలు బాగుంటాయి. విలువైన వస్తువుల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండండి.

ఈ వారం కా'ర్టూన్స్'


అది డ్రోన్ స్కానర్.. లైవ్ లో నా బాడీ ని స్కాన్ చేస్తూ బీపీ,షుగర్, హార్ట్ బీట్ లాంటి రిపోర్ట్స్ మా డాక్టర్ కు పంపిస్తూ ఉంటుంది


కాపలా కాసేది అది ఆ శునకాసనం లోనే ఉంటున్నది.. కొత్త ఆసనాలేవీ నేర్పించకండి..!!


అక్కడ సహజీవనం అనుమతిస్తారా..?!
నరకం



సిక్కింలోని
హిల్ స్టేషన్ పెల్లింగ్‌కు
సంబంధించిన చిత్రాలివి. ప్రకృతి
ప్రేమికులను, ట్రెక్కింగ్ ప్రియులను
విశేషంగా ఆకర్షిస్తుందీ ప్రాంతం.
బౌద్ధారామాలు, బొటానికల్ గార్డెన్లు,
జలపాతాలకు నిలయం. కాంచనజంగ
పర్వతాన్ని ఇక్కడి నుండి దగ్గరగా
చూడవచ్చు.



